స్థాపితం : 1930 LONGEST LIVING NEWSPAPER IN TELUGU JOURNALISM

స్థాపకుడు : నెల్లూరు వెంకట్రామానాయుడు
జీవప్రదాత : నెల్లూరు శ్రీరామమూర్తి

జమీన్ రైతు

సంపుటి : 80 సంచిక : 5 30-1-2009 శుక్రవారం 16 పేజీలు విడి ప్రతి : రూ. 5/-


షైన్
సూపర్ స్పెషాలిటి దంత వైద్యశాల
ఇంప్లాంటేషన్.
రూట్ కెనాల్ ట్రీట్‌మెంట్.
డా॥ SK. మహమ్మద్ అలి
కాస్మెటిక్ డెంటల్ సర్జన్

కేర్
సూపర్ స్పెషాలిటీ దంతవైద్యశాల
పొగతోట, నెల్లూరు - ఫోన్ : 2303300

చంద్రబాబును అరెస్ట్ చేస్తారా?

వైఎస్ రాజశేఖరరెడ్డి, చంద్రబాబు నాయుడుల మధ్య ఎంతటి రాజకీయ విద్వేషం వుందో అందరికీ తెలుసు. రాజకీయ ప్రత్యర్థుల స్థాయి నుంచి, వ్యక్తిగత శతృత్వం స్థాయికి పెరిగిపోయింది స్పర్థ. ఒకరి మీద ఒకరు గులక రాయి విసిరే అవకాశం దొరికితే, బండ రాయితో మోదాలని చూసే పరిస్థితి. చంద్రబాబు నాయుడుకు చెందిన హెరిటేజ్ ఫుడ్స్ కంపెనీలో జరిగిందని చెప్తున్న భూముల అమ్మకం వివాదాన్ని తన కక్ష తీర్చుకోవడానికి ఒక మార్గంగా మలచుకొంటున్నాడు రాజశేఖరరెడ్డి ఇప్పుడు.

హెరిటేజ్ ఫుడ్స్, చంద్రబాబు స్వంత కంపెనీ. 1992లో ప్రారంభించారు దాన్ని. 1994లో పబ్లిక్ ఇష్యూకు వెళ్లారు. 1995లో ముఖ్యమంత్రి అయ్యే వరకు ఆ కంపెనీకి చంద్రబాబే మేనేజింగ్ డైరెక్టర్. ఆ తర్వాత తన సతీమణి భువనేశ్వరిదేవికి అప్పచెప్పారు. మొదట మొదట కేవలం పాల వ్యాపారానికి మాత్రమే పరిమితమైన డైరీ కంపెనీ అది. ఇటీవల రిటైల్ సూపర్‌మార్కెట్ల నిర్వహణలో ప్రవేశించింది. చెన్నై, హైదరాబాద్, బెంగుళూరు నగరాలలో చాలా అంగళ్లే పెట్టారు. వాటికి కూరగాయల సరఫరా కోసం చిత్తూరు,



మెదక్ జిల్లాలో రైతుల ద్వారా కాంట్రాక్ట్ ఫార్మింగ్ నిర్వహిస్తున్నారు. డైరీ వ్యాపారంలో హెరిటేజ్ కంపెనీకి మొదటి నుంచి లాభాలు వస్తున్నాయి. కానీ రిటైల్ దుకాణాలు కొత్తవి కాబట్టి, సహజంగానే నష్టం వచ్చింది. 2008 మార్చి నెలాఖరుకు తయారు చేసిన బ్యాలెన్స్ షీటు ప్రకారం, మొత్తం మీద దాదాపు 35కోట్ల నష్టం వచ్చింది. దీని వల్ల వ్యాపారం దెబ్బ తినకుండా చూడడానికి, హెరిటేజ్ ఫుడ్స్ కంపెనీకి అనుబంధంగా నడుస్తున్న హెరిటేజ్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ అనే మరొక కంపెనీలో తమకున్న షేర్లను విక్రయించి, ఆ సొమ్ముతో నష్టాలను పూడ్చారు.


ఈ లావాదేవీలలో చిన్న మతలబు వుంది. మాదాపూర్‌లోని మూడున్నర ఎకరాల భూమి హెరిటేడ్ ఫుడ్స్ ఆస్తి. 2006లో దాన్ని 2కోట్ల 75లక్షల ధరకు అమ్మారు. ఆ విలువకు ఆ కొత్త కంపెనీలో 51శాతం షేర్లు తీసుకొన్నారు. అసలు కంపెనీలో నష్టాలు వచ్చాయి కాబట్టి, వాటిని పూడ్చడానికి భూమి అమ్మగా వచ్చిన షేర్లను 35 కోట్లకు అమ్మి, ఆ సొమ్ము కంపెనీ ఖాతాలో జమ చేశారు. వైఎస్ కుమారుడు వైఎస్ జగన్ నడిపే సాక్షి దిన పత్రిక దీన్ని తప్పుపట్టింది. ఎకరం పది, పన్నెండు కోట్లు విలువ చేసే భూమిని, మొత్తం మూడున్నర ఎకరాలు కలిపి రెండున్నర కోట్లకు అమ్మడం ద్వారా హెరిటేజ్ కంపెనీ షేర్ హోల్డర్లను మోసం చేశారన్నది సాక్షి పత్రిక ఆరోపణ. ఆ తర్వాత అదే భూమికి 35కోట్ల విలువ కట్టి, డబ్బు కంపెనీలోకి తెచ్చినప్పటికీ, మొదట అమ్మకం దగా అన్నది విమర్శ.

ఈ లావాదేవీని, చంద్రబాబు మీద కక్ష తీర్చుకోవడానికి ఒక మార్గంగా ఎంచుకొంటున్నాడు ముఖ్యమంత్రి. సత్యం కంప్యూటర్ సర్వీసెస్‌కు, చంద్రబాబు కంపెనీకి పోలిక పెట్టి, ఆయన్ను లేదా ఆయన భార్య, కుమారులను అరెస్టు చేస్తే ఎట్లా వుంటుందన్న చర్చ జరుపుతున్నాడు. 29 తేది సాయంత్రం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఇదే అంశాన్ని కూలంకషంగా చర్చించారు. దీనిపై దర్యాప్తు చేసి, నివేదిక ఇవ్వాలని చీఫ్ సెక్రటరీ రమాకాంతరెడ్డిని ఆదేశించారు. లేని లాభాలు చూపించి కంపెనీని దగా చేశాడని సత్యం రామలింగ

కొరవ 14వ పేజీలో

బాలకృష్ణ బోణీ బ్రహ్మాండం!

తెలుగుదేశం ప్రచార బాధ్యత పైన వేసుకొన్న నందమూరి బాలకృష్ణ తొలి సభతోనే హోరెత్తించాడు. అనంతపురం జిల్లా హిందూపురంలో ఆయన పర్యటన తెలుగుదేశం వర్గాలను



ఆనందసాగరంలో ముంచెత్తింది. అలనాటి ఎన్టీఆర్‌ను మించి జనం వచ్చారు. హిందూపురం పట్టణం మొత్తం జన సముద్రంగా మారిపోయింది. ఇసకేస్తే రాలని పరిస్థితి. అన్ని అంచనాలను మించిపోయిందా జన స్పందన. బోణీ సభే ఇంత బ్రహ్మాండంగా జరగడంతో చంద్రబాబుతో సహా మహాకూటమి నేతలంతా మహ

-14వ పేజీలో

మాడిన ముఖానికి వెలుగు

తెలంగాణా విషయంలో వైఎస్ రాజశేఖరరెడ్డి బెదరింపులకు లొంగి, తనను చీపురుపుల్ల క్రింద తీసిపారేశారనే చింతతో నల్లగా మాడిపోయి వుండిన పిసిసి అధ్యక్షుడి ముఖంలో మళ్లీ వెలుగు కనిపిస్తున్నది. శాసనమండలి అభ్యర్థుల విషయంలో అధిష్టానం వైఎస్‌కు చిన్న జలక్ ఇవ్వడమే అందుకు కారణం. తెలంగాణా వంటి కీలక అంశంలోనే తన మాట నెగ్గించుకొన్న ముఖ్యమంత్రి ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబితాను కూడా తన ఇష్టం వచ్చిన వారితో వ్రాస్తాడని అందరూ భావించారు. అదే జరిగితే తాను పిసిసిలో కొనసాగడం కూడా వ్యర్థమౌతుందని భయపడ్డాడు డిఎస్. రేపటి ఎన్నికలలో ఎమ్మెల్యే టిక్కెట్ల పంపిణీలో తన మాటకు ఎంతో కొంత విలువ వుంటుందనే నమ్మకం పార్టీ వర్గాలలో కల్గిస్తే తప్ప తన వద్దకు ఎవరూ రారని ఆయనకు తెలుసు. కనీసం 10శాతం టిక్కెట్లయినా తాను ఎంపిక చేస్తాననే అభిప్రాయం కలిగిస్తేనే పిసిసి ఆఫీసు వైష్ణవాలయం వలె కళకళ లాడుతుంది. లేకుంటే శివాలయం వలె వెలవెల పోతుంది. అభ్యర్థులను తన వద్దకు రప్పించుకోవాలంటే, శాసన మండలిలో కూడా కనీసం ఒకటి రెండు



టిక్కెట్లు తన మాట ప్రకారం జరిగాయనిపించుకోవాలి. కానీ ముఖ్యమంత్రి ధోరణి చూస్తే అట్లా కనిపించలేదు. టిక్కెట్లు నీకు సంబంధించిన అంశం కాదన్నట్లు తనను దూరం పెట్టడం డిఎస్‌కు మనసు కష్టం కల్గించింది. అయితే, తెలంగాణా విషయంలో వైఎస్ గీచిన గిరి దాటని అధిష్టానం విచిత్రంగా శాసనమండలి అభ్యర్థుల ఎంపికలో మాత్రం వైఎస్ మాటకు విలువ ఇవ్వకపోవడం డిఎస్‌కు వెయ్యేనుగుల బలాన్ని ఇచ్చింది. లాటరీ ద్వారా అభ్యర్థులను

కొరవ 14వ పేజీలో

చివరి వరకు సస్పెన్స్!

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలలో ఎవరికి మళ్లీ టిక్కెట్లు ఇస్తున్నారు, ఎవరికి ఎగనామం పెడుతున్నారన్నది నామినేషన్ గడువు ముగిసే చివరిరోజు వరకు వూహాగానాలకు పరిమితం చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించినట్లు తెలుస్తున్నది. 186 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలలో 70 నుంచి 80 మంది వరకు టిక్కెట్లు రావన్న సంగతి అందరికీ తెలుసు. ఆ 70 మంది ఎవరన్నది మాత్రం ఒక్క ముఖ్యమంత్రికి మాత్రం తెలుసు. ఫిబ్రవరి 2 నుంచి ప్రారంభం కానున్న శాసనసభ సమావేశాల సమయంలో వీరిని పిలిపించి, నచ్చ చెప్పే ప్రయత్నం చేస్తారని ఒక అభిప్రాయం వుంది. కానీ ఇప్పుడు ముఖ్యమంత్రి తన మనసు మార్చుకొన్నారట. నామినేషన్ గడువు ముగిసే సమయంలో మాత్రమే ఆ జాబితా వెల్లడి చేయాలని భావిస్తున్నారట.

టిక్కెట్లు రావని తేలితే, వీరిలో సగం మందికి పైగా ప్రజారాజ్యం, తెలుగుదేశం పార్టీలకు వలస వెళ్లే ప్రమాదం వుందన్న భయమే ఈ దాపరికానికి కారణం. టిక్కెట్ ఇవ్వకూడదని నిర్ణయం తీసుకొన్న ప్రతి ఎమ్మెల్యేకు, ఏ వివరణ ఇవ్వాలో, ఎట్లా బుజ్జగించాలో ముఖ్యమంత్రి ముందుగానే సిద్ధం చేసి పెట్టుకొన్నాడు. ఇప్పుడు టిక్కెట్ ఇవ్వక



పోయినా అధికారంలోకి రాగానే ఏ పదవి ఇవ్వబోయేది ముందుగానే హామీ ఇవ్వాలన్నది ఆయన వ్యూహం. అయితే అందరూ తన మాట వింటారన్న నమ్మకం కలగడం లేదు. ముందుగా వారికి టిక్కెట్ సమాచారం అందిస్తే, ఇతర పార్టీలలోకి వలస వెళ్లి నష్టం చేసే ప్రమాదం వుంది. చివరి నిముషం వరకు సస్పెన్స్‌లో పెడితే, అప్పుడు వారు చేయగల్గింది ఏదీ వుండదు. వేరే పార్టీలోకి వెళ్లడానికి వ్యవధి దొరకదు. అప్పటికే ఆ పార్టీలకు అభ్యర్థుల నిర్ణయమైపోయి వుంటారు. పార్టీ యంత్రాంగాన్ని దెబ్బ తీసే అవకాశం కూడా తక్కువగా వుంటుంది. కొత్త అభ్యర్థి ప్రకటన జరిగీ జరగగానే, కార్యకర్తలు ఆ వూపులో అటువైపు వెళ్లిపోతారు కాబట్టి, టిక్కెట్ రాని ఎమ్మెల్యేలు కార్యకర్తలను ప్రభావితం చేయలేరు.

అయితే టిక్కెట్లు ఎగనామం పెట్టాలని వ్రాసుకొన్న జాబితాలో, తెలంగాణా వాసులు చాలా కొద్ది మంది వున్నారని వినికిడి. టిఆర్‌ఎస్‌తో తగవు, తెలంగాణా ఇవ్వక పోవడం వంటి కారణాల వల్ల అక్కడ పార్టీ పరిస్థితి చాలా బలహీనం కాబట్టి, సిట్టింగ్ ఎమ్మెల్యేలను ఇబ్బంది పెట్టి కొత్త సమస్యలు తెచ్చుకొనే వుద్దేశం ముఖ్యమంత్రికి లేదు. కోస్తాలో మాత్రం ప్రతి జిల్లా నుంచి ఐదారుగురికి టిక్కెట్లు దక్కవని అంచనా.

70 ఏళ్లక్రితం ఈ వారం

కాంగ్రెస్ పీఠం మరల సుబాసునే వరించింది

11 రాష్ట్రములలో పట్టాభికిని. 10 రాష్ట్రములలో సుబాసుకు మెజారిటీ వచినది. బోసుకు 1575 ఓట్లు - పట్టాభికి 1376 - భేదం 199. ఈ పది రాష్ట్రాల్లో బోసుకు ఎక్కువ ఓట్లు వచ్చాయి. (1)తమిళనాడు, (2)పంజాబ్, (3)యునైటెడ్ ప్రావిన్సెస్, (4)ఢిల్లీ, (5)అస్సాము, (6)అజ్మీరు మర్వారా, (7)బర్మా, (8)కర్నాటక, (9)కేరళ, (10)బెంగాలు. ఈ 11రాష్ట్రాల్లో పట్టాభికి ఎక్కువ ఓట్లు వచ్చాయి. (1)ఆంధ్ర, (2)ఉత్కళ, (3)గుజరాత్, (4)బీహారు,

3-2-1939

పేజీలు: 20 వెల: అర్ధణా

(5)సెంట్రల్ ప్రావిన్సెస్, (6)బీహారు, (7)బొంబాయి, (8)మహాకోసల, (9)మహారాష్ట్ర, (10)సింధు, (11)సరిహద్దు రాష్ట్రములు. బోసుగారికి స్వంత రాష్ట్రమగు బెంగాలులో పట్టాభిగారి కన్నా 325 ఓట్లు అధికంగా వచ్చాయి. పట్టాభిగారికి స్వంత రాష్ట్రమగు ఆంధ్ర రాష్ట్రంలో 153ఓట్లు అధికంగా వచ్చాయి.

పరాజయం పట్టాభిదికాదు నాదే!

బోసు విజయం గూర్చి గాంధీజీ ప్రకటన

"సుబాసు బాబును మరల ఎన్ను కొనుట నాకు ఇష్టం లేదు. పట్టాభిని ఉపసంహరించుకోకుండా బలవంతం పెట్టింది నేను. అందుచేత ఈ అపజయ మంతా ఆయనది కాదు; నాదే. నా సిద్ధాంతాలను కాంగ్రెస్ ప్రతినిధులు అంగీకరించడం లేదని ఈ ఎన్నిక వలన తేలింది"- గాంధీజీ.

***

ఈ సంవత్సరం కాంగ్రెసు అధ్యక్షుని ఎన్నిక కాంగ్రెస్‌చరిత్రలోను, భారత దేశ చరిత్రలోను చాలా ప్రాముఖ్యమైనది. యోధానుయోధులగు వర్కింగ్ కమిటీ సభ్యులు పటేల్, బాబురాజేంద్రప్రసాద్, అజాద్, పట్టాభిగారలను ధిక్కరించి బోసు అధ్యక్షపీఠమును జయించాడు.

పోలీసులే దొంగలైతే...?

తూర్పు గోదావరి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ నాగిరెడ్డి ఒక దొంగల ముఠాకు నాయకుడిగా వ్యవహరిస్తున్నాడన్న వార్త వింటుంటే, మనసుకు కలత చెందుతున్నది. కడప జిల్లాకు చెందిన ఒక దొంగల ముఠాను కాకినాడకు రప్పించాడట. వారికి పోలీసు గెస్టుహౌస్‌లో బస కల్పించాడు. కాకినాడ ఓడరేవుకు వచ్చే స్టీమర్ల నుంచి పైపుల ద్వారా దిగుమతి అయ్యే పెట్రోల్, డీజిల్‌లను దొంగలించి, అమ్ముకోవడం వీరి కార్యక్రమం. వారు ఆ చోరీకి పాల్పడుతున్నంత సేపూ, ఎవరూ అడ్డం రాకుండా పోలీసు సిబ్బందిని కాపలా పెట్టేవాడట. దోచుకొన్న పెట్రోల్ అమ్మగా వచ్చిన సొమ్మును ఏ రోజుకారోజు వాటాలు పంచుకొనేవారట. తమ పెట్రోల్ చోరీకి గురౌతున్నదని హిందుస్థాన్ పెట్రోలియం కంపెనీ ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పోలీసులు పట్టించుకోకపోవడంతో, పైస్థాయిలో ఫిర్యాదు చేశారు. దానితో నిజానిజాలు తేల్చడానికి డిఐజి స్థాయి అధికారి ఒకరు రంగంలోకి దిగారు. ఆయన తీగలాగితే, ఎస్పీ ఇంట్లో డొంక కదిలింది.

ఎస్పీ స్థాయిలోని ఒక ఐపిఎస్ అధికారి దొంగల ముఠా నాయకుడిగా వ్యవహరిస్తున్నాడన్న నిజాన్ని మొదట పోలీసు అధికారులే నమ్మలేకపోయారు. కానీ లోతుగా దర్యాప్తు చేసిన తర్వాత అది ధృవపడింది. దొరికిన దొంగలంతా తమకు ఎస్పీ చేసిన సహాయం ఏమిటి, అందుకు తాము చెల్లించిన మొత్తాలెంత అన్న సమాచారం వివరంగా చెప్పేశారట. పరమ నీచము, హేయమైన ఈ దారుణ నేరం బయటపడకుండా తొక్కి పెట్టడానికి అన్ని ప్రయత్నాలూ చేసింది ప్రభుత్వం. అయితే ఆంధ్రజ్యోతి దినపత్రిక మొత్తం కథను బయట పెట్టడంతో అందరూ ఉలిక్కి పడ్డారు. పోనీ అప్పుడైనా చేసిన తప్పులు లెంపలేసుకొని, ఆ ఎస్పీని కటకటాల వెనక్కు పంపించారా అంటే, అదీ లేదు. ఈ నేరం వెలికి తీయడానికి దర్యాప్తు జరిపిన అదే జిల్లా అడిషనల్ ఎస్పీని క్షణాల మీద బదలీ చేశారు. ఆ ఉత్తర్వులు అతడి చేతికి అందకముందే, ఆయన గదికి తాళం పెట్టేశారు. ఎస్పీ దొంగల ముఠాకోరుతనానికి అడిషనల్ ఎస్పీ సేకరించిన ఆధారాలు, సాక్ష్యాలను మాయం చేయడం కోసమే ఆ గదికి తాళం పెట్టారన్నది స్పష్టం.

తనవారు అనుకొంటే, వారు దొంగలైనా, హంతకులైనా, దోపిడీదారులైనా పూర్తి రక్షణ కల్పించడం ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి తత్వం. కానీ ఒక ఐపిఎస్ అధికారి, అందులోనూ ఎస్పీ వంటి బాధ్యతాయుత మైన పదవిలో వున్న వ్యక్తి దొంగల ముఠా నాయకుడని తేలిన తర్వాత కూడా రక్షించడానికి ప్రయత్నించడం ఎంత ఘోరమైన నేరం? ఈ ఎస్పీ దొరగారికి, వైఎస్ జగన్‌తో దగ్గరి సంబంధాలుండడమే ఇందుకు కారణమని చెప్పున్నారు. జగన్ రాజమండ్రికి వచ్చినప్పుడు ఎయిర్‌పోర్టుకు వెళ్లి శాల్యూట్ చేయడంతో పాటు, ఆయన జిల్లాలో తిరిగినంత సేపూ కానిస్టేబుల్ వలె బాడీగార్డు డ్యూటీ చేస్తాడట ఆ ప్రబుద్ధుడు. అందుకు కృతజ్ఞతగా అతడి దొంగతనాన్ని దొరతనంగా మార్చడానికి చూస్తున్నాడు ముఖ్యమంత్రి.

ఈ సంఘటనలు వింటుంటే, పోలీసు వ్యవస్థ మీదనే అసహ్యం కల్గుతున్నది. ప్రభుత్వాన్ని నిలువులోతు గొయ్యి త్రవ్వి పాతర పెట్టాలన్నంత కసి పుడుతున్నది. రాజకీయాలలో అవినీతి, అధికార దుర్వినియోగం ఒక దశ వరకు తప్పక పోవచ్చు. కానీ అధికారం వుందికదా అని పోలీసులను దొంగలుగా మార్చడం మొదలు పెడితే, సమాజం ఏమౌతుంది? ప్రజల జీవితాలు ఎంత నాశనమౌతాయి? రాజశేఖర రెడ్డి ఎందుకంత ఘోరంగా ప్రవర్తిస్తున్నాడు? తన చర్యల వల్ల ప్రజాస్వామ్యం ఎంత పరిహాసాల పాలౌతున్నదీ ఆయనకు ఎందుకు అర్థం కావడం లేదు?

ఇంత గొడవ జరిగినా ఈ నాటికీ ఆ ఎస్పీ అదే జిల్లాలో, అదే పదవిలో కొనసాగుతున్నాడు. దాన్నిబట్టి, జరిగిన నేరాన్ని నేరంగా భావించే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని అర్థం చేసుకోవచ్చు. రాజశేఖరరెడ్డి స్థానంలో మరెవ్వరు ముఖ్యమంత్రిగా వుండినా ఇప్పటికే ఆ పోలీసు దొంగ జైలు వూచలు లెక్కపెడుతూ వుండేవాడు.

ఒక దగుల్బాజీ వెధవతనం వల్ల మొత్తం ఐపిఎస్ వ్యవస్థకు, పోలీసు యంత్రాంగానికి కలుగుతున్న అప్రతిష్ట, అవమానం, ప్రజల దృష్టిలో ఏహ్యభావాలను అర్థం చేసుకొని వున్నతస్థాయి ఐపిఎస్ అధికారులైనా చొరవ చూపడం అవసరం. ప్రభుత్వ నేతతో నిమిత్తం లేకుండా ఈ దొంగ పోలీసు అధికారిని ఐపిఎస్ నుంచి వెలి వేయించాలి. కానీ మన దౌర్భాగ్యం - మన డిజిపి కూడా అదే కోవకు చెందిన వాడి వలె వున్నాడు. తన శాఖ పరువు తీసిన అధికారిని శిక్షించడం మాని, ఆ నిజాన్ని వెలుగులోకి తెచ్చిన ఆంధ్రజ్యోతి దినపత్రిక మీద విరుచుకపడుతున్నారాయన. ఇటువంటి దౌర్భాగ్యుల చేతిలో పోలీసు శాఖ చిక్కుకపోతే, ఇక ప్రజలకు రక్షణ ఎక్కడ?

50 ఏళ్లక్రితం ఈ వారం

బాపూజీకి భక్త్యంజలి!

బాపూజీ దివికేగిన విషాద దినం జనవరి 30. గాంధీజీ మనలను వీడి అప్పుడే పదకొండేళ్లు నిండినవి. నేడు భారత ప్రజలు, విషణ్ణ హృదయాలతో జాతిపితను సంస్మరిస్తారు. ఢిల్లీ రాజఘాట్‌లోని బాపూ సమాధి నేడు అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. ఢిల్లీలోని ప్రభుత్వాధినేతలు, నాయకులు, ప్రజలు స్వయంగా రాజఘాటుకు వెళ్లి సమాధిపై పుష్పగుచ్ఛాలుంచి, భక్త్యంజలి ఘటిస్తారు. రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ దంపతులు, డాక్టర్ రాధాకృష్ణన్ ప్రభృతులు సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

30-1-1959

పేజీలు: 12 వెల: 0-3-0

'హై' లేదు - 'కమాండు' లేదు!!

కాంగ్రెస్ హైకమాండు పటుత్వం దినదినానికి నీరసిస్తూ, ధేబర్ హయాంలో పూర్తిగా దిగజారిపోయినది. సర్దారు పటేలు కాలంలో హైకమాండు అంటే హడలుగా వుండేది. అగ్రనాయకుల దృష్టి నిష్పాక్షికంగా వుండడమే దానికి కారణం. కాంగ్రెస్ ఆదేశాన్ని ధిక్కరించేవాడు ఆ రోజుల్లో అరుదు. ఎవరు తప్పుచేసినా - నిర్ధాక్షిణ్యంగా చర్యదీసుకోబడేది. ఇప్పుడా అగ్రనాయకులే వర్గాలకు అతీతులు కాలేకున్నారు. అందువల్లనే వారి మాటకు గాని, వారి ఆజ్ఞకుగాని విలువ లేకుండా పోయినది. కాంగ్రెస్ అగ్రనాయకత్వంలో హై(ఆధిక్యత) లేదు. కమాండు (ఆజ్ఞాపాలన) గాని లేదు.

ముఖ్యమంత్రి కార్యక్రమం

ఫిబ్రవరి 9, 10, 11 తేదులలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి గారు నెల్లూరు జిల్లాలో పర్యటించనున్నారని తెలుస్తున్నది. అధికార రీత్యా కార్యక్రమం ఇంకా వెలువడలేదు కాని, ప్రస్తుతానికి మాకు తెలిసినంత వరకు 9వ తేది ఆత్మకూరు, 10వ తేది నెల్లూరు, 11వ తేది ఆత్మకూరు తాలూకా రాజకీయమహాసభను ప్రారంభించెదరు.

రెండు పార్టీల పాలనే మేలు!

భారతదేశం స్వతంత్ర సర్వసత్తాక గణతంత్ర సమాజంగా రాజ్యాంగ పధంలో 59 ఏళ్ల ప్రస్థానం పూర్తి చేసింది. జాతీయ విజయాలతోపాటు అపజయాలు మనల్ని వెక్కిరిస్తున్నాయి. అమెరికా, బ్రిటన్ రాజ్యాంగాల కలబోతగా ఏర్పడిన మన రాజ్యాంగం వల్ల దేశంలో రాజకీయ స్థిరత్వం తగ్గుతోంది. పుట్టగొడుగుల్లాంటి పార్టీలు పుట్టుకొస్తున్నాయి. వీటికి నాయకులుగా లాలూప్రసాద్, శిబూసోరెన్, మాయావతి వంటి వారు కొనసాగుతున్నారు. ప్రజాస్వామ్య సూత్రాలకు ఏమాత్రం భంగం కాని రీతిలో కేంద్రంలో రెండు పార్టీల ప్రభుత్వాన్ను నెలకొల్పాలి. రాజ్యసభకు సైతం ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలి. దేశప్రధాని గాని, ముఖ్యమంత్రి గాని, పదవిలో రెండుసార్లు మించి ఎవరూ పనిచేయకుండా రాజ్యాంగంలో మార్పులకు ముందడుగు వేయాల్సిన తరుణమిదే.

సి.అరుణకుమారి నెల్లూరు

వాస్తవాన్ని కళ్లకుకట్టిన సంపాదకీయం!

పాలస్తీనాలోని వాస్తవ పరిస్థితులు కళ్లకు కట్టేలా జనవరి 16వ తేది జమీన్ రైతులో పాపం, పాలస్తీనా! శీర్షికతో వ్రాసిన సంపాదకీయం బాగుంది. పాలస్తీనాకు ఐక్యరాజ్య సమితి కూడా అమెరికా ఒత్తిడితో అన్యాయం చేసింది. ఇపుడైతే ఇజ్రాయెల్ పాలస్తీనా భూభాగంపై ప్రతిరోజు అన్యాయంగా దాడులు చేస్తూ అమాయకులను పొట్టన పెట్టుకొంటున్నా ప్రపంచంలోని ఒక్క దేశం కూడా పట్టించుకోక పోవడం బాధాకరం. ఇంతకంటే ఘోరం, దారుణం మరొకటి వుండదు. ఒబామా అమెరికా అధ్యక్షుడు అయిన నేపథ్యంలో బలహీన దేశాలపై బలమైన దేశాల దాడులను ఆపేందుకు కార్యాచరణ రూపొందించాలి.

వాస్తురామచంద్ర నెల్లూరు

జనవాణి

ట్రాఫిక్ సమస్యను పట్టించుకోండి!

నెల్లూరు నగరంలో ట్రాఫిక్ పద్మవ్యూహంలా మారిపోయింది. ఉదయం 9.30నుంచి ఒంటిగంట వరకు, సాయంత్రం ఐదుగంటల నుంచి తొమ్మిది గంటల వరకు అయ్యప్పగుడి నుంచి ఆత్మకూరు బస్టాండ్‌కు చేరను ఎంతో శ్రమపడాల్సివస్తుంది. వెంకటేశ్వరపురం వద్ద అప్రోచ్ రోడ్ల నిర్మాణం జరగకపోవడం వల్ల తరచూ ట్రాఫిక్ నిలిచిపోతుంది. ఆత్మకూరు బస్టాండ్ నుంచి కావలి వెళ్లే వాహనాలు మినీ బైపాస్, చిల్డన్స్‌పార్కు మీదుగా నాలుగులైన్ల జాతీయ రహదారి ఎక్కాల్సి వస్తుంది. నగరంలో సిటీ బస్సులు, ఆటోలను నియంత్రించే వారే లేకుండాపోయారు. పోలీసులు, రవాణా, కార్పొరేషన్ అధికారులు ఒకరి మీద మరొకరు చెప్పుకొంటూ నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కాకుండా చేయడం బాధాకరం.

సి.హెచ్.సురేష్‌బాబు నెల్లూరు

బాలికల హాస్టళ్లు మెరుగుపర్చాలి!

ఉదయగిరి, బుచ్చిలలోని బాలికల హాస్టళ్ల పరిస్థితులు ఘోరంగా వున్నాయని పత్రికల్లో వచ్చిన వార్తలు చదివి హృదయం బరువెక్కింది. హాస్టళ్లలో మేట్రిన్, వార్డన్లుగా పనిచేసే వాళ్లంతా గతంలో హాస్టళ్లలో చదువుకొన్నవారే. కాని వారు అక్కడి పిల్లలపట్ల వారు శ్రద్ధ చూపకపోవడం బాధాకరం. పాత కలెక్టర్ రవిచంద్ర హాస్టళ్లలో చదువుకొనే విద్యార్థులు, అక్కడి పరిస్థితులు మెరుగుపర్చడాన్ని ఎంతో కృషి చేసే వారు. కొత్త కలెక్టర్ రాంగోపాల్ హాస్టళ్లలో పరిస్థితులు మెరుగుపర్చను కలెక్టరేట్‌లో కాల్ సెంటర్ ఏర్పాటుచేశాక కూడా పరిస్థితుల్లో మార్పు రాకపోవడం బాధాకరం.

పి.ఉషారాణి బుచ్చిరెడ్డిపాళెం

జవహర్‌భారతిలో వనమూలికల పరిశోధన!

కావలి జవహర్‌భారతి కళాశాలలో ప్రఖ్యాతిగాంచిన సువిశాలమైన తోట వుంది. దీనిలో వివిధ వైద్య మూలికలను పెంచితే బాగుంటుంది. కాలేజీలోని వృక్షశాస్త్ర విభాగంలో పరిశోధనానుభవం గల అధ్యాపకులు ఎందరో వున్నారు. విశ్రాంతి తీసుకొంటున్న అధ్యాపకుల సేవలు దీనికి గాను వినియోగించుకోవచ్చు. ఈ విషయంలో కాలేజి యాజమాన్యం నిర్ణయం తీసుకొంటే జవహర్ భారతికి ఆయుర్వేద వనమూలికావనం కీర్తి కూడా సమకూరుతుంది.

ఎల్.నారాయణశర్మ కావలి

నెల్లూరు ముచ్చట్లు

సమాచారశాఖ ఫోన్ కట్!

నెల్లూరులోని సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయం (డిపిఆర్వో ఆఫీసు) ఫోన్‌ను టెలికాం అధికారులు కట్ చేశారు. రెండు నెలల బిల్లు 30వేల రూపాయలు కట్టలేదని ఈ పని చేశారు. సమాచార మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్వంత జిల్లాలో సమాచార శాఖ కార్యాలయం ఫోను మూగబోవడం దాన్ని ఎవరూ పట్టించుకోకపోవడం బాధాకరం.

ఎస్ఐలకు అంత కక్ష ఎందుకు?

ప్రభుత్వ తీరును ఎండగడుతూ ప్రతిపక్షాలు నిరసన తెలియజేయడం రాజ్యాంగం కల్పించిన హక్కు. నెల్లూరు పోలీసులు మాత్రం చిన్న నిరసన తెలియజేస్తున్నా తట్టుకోలేక ప్రజలపై ఫాసిస్టు ధోరణిలో అణచివేతకు పాల్పడుతున్నారు. నగరంలోని త్రీటౌన్, ఫోర్త్‌టౌన్ ఎస్ఐలుగా పనిచేస్తున్న శ్రీనివాసులురెడ్డి, వేమారెడ్డిలు 28వ తేది కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేయను వచ్చిన సిపిఎం నేతలు, కార్యకర్తలను ఈడ్చి పడేయడం విమర్శలకు తావిచ్చింది. సిపిఎం నగర నాయకుడు మోహన్‌రావుతోపాటు కార్పొరేటర్ కత్తి శ్రీనివాసులుపై ఈ ఇద్దరు ఎస్ఐలు ప్రదర్శించిన దాష్టీకం గర్హనీయం.

స్టాండింగ్ కౌన్సిల్ సమావేశాలప్పుడు కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు, కార్యకర్తలు కార్పొరేషన్ కార్యాలయంలో షామియానా లేసుకొని వందల మంది కూర్చోవచ్చు. మిగతా పార్టీలు కమీషనర్‌కు వినతిపత్రం సమర్పించను అనుమతించరు. ఇదేమి న్యాయం మల్లారెడ్డి గారు?

బాపు గీసిన బొమ్మలేవి?

నెల్లూరు కస్తూరిబా కళాక్షేత్రంలో ముందు గోడకు ప్రఖ్యాత చిత్రకారుడు బాపు గీసిన నవరస భంగిమలు వేలాడుతుండేవి. ఇప్పుడు వీటిని తొలగించి ఎక్కడో పడేశారు. వీటిని గతంలో సిసినటుడు సూతన ప్రసాద్ ఆవిష్కరించారు. 27వ తేది నెల్లూరు వచ్చిన సూతన ప్రసాద్ ఈ విషయాన్ని ప్రస్తావించి కళాక్షేత్రంలో తక్షణం ఆ చిత్రరువులు తిరిగి అమర్చాలని జిల్లా అధికారులను కోరారు.

వాతావరణం మారింది

నెల్లూరు నగరంలో గతవారం రోజులుగా వాతావరణంలో మార్పులు కనపడుతున్నాయి. 26, 27 తేదీల్లో వివరీతంగా మంచు కురిసింది. ఉదయం 9 గంటల వరకు మంచుతెర నగరాన్ని కప్పేయడంతో జనం ఇబ్బంది పడ్డారు. రాత్రిపూట చలిగాలి వీస్తున్నా 28వ తేది నుంచి పగటి పూట ఎండకు ఉక్కపోత ఆరంభమయ్యింది. 26వ తేది సూర్యగ్రహణం సంభవించినప్పటి నుంచి మధ్యాహ్నపు ఎండ అదరగొడుతుంది.

వివేకా అభినవ చాచా అట?

భారత ప్రధమ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూను పిల్లలు చాచా నెహ్రూ అని కూడా పిలుస్తారు. నెల్లూరు నారాయణ స్కూల్ నిర్వాహకులకు ఎమ్మెల్యే వివేకానందరెడ్డితో ఏ పని పడిందో ఏమో; జనవరి 26వ తేది స్కూల్‌లో జరిగిన క్రీడోత్సవానికి ముఖ్య అతిథిగా పిల్చి ఆయన్ను 'అభినవ చాచా' బిరుదుతో సత్కరించారు. సన్మానాలు వాళ్ల ఇష్టం. ఇటువంటి గొప్ప బిరుదు ప్రదానానికి వివేకా అర్హుడా అనేదే నగరంలో ప్రధాన చర్చ.

నెల్లూరులో సునాద వినోదిని!

శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానల్ ప్రఖ్యాత గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నేతృత్వంలో సునాద వినోదిని పేరుతో సంగీత కార్యక్రమం జరుపుతున్న విషయం పాఠకులకు తెలిసిందే. ఈ కార్యక్రమం ఫిబ్రవరి 3, 4 తేదీల్లో నెల్లూరులోని కస్తూరిబా కళాక్షేత్రంలో ఏర్పాటుచేశారు. రాష్ట్రస్థాయిలో జరిగే ఈ కార్యక్రమానికి నెల్లూరీయులంతా వచ్చి జయప్రదం చేయమంటున్నారు కార్యనిర్వాహకులు హజరత్‌బాబు, వాకాటి విజయకుమార్‌రెడ్డి, బి.వి.నరసింహం.

జిల్లాలో గొర్రెల బీమా పథకం

దేశంలోనే తొలిసారిగా మన రాష్ట్రంలో ప్రవేశపెట్టిన గొర్రెల బీమా పథకాన్ని నెల్లూరు జిల్లాలో అమలు చేయనున్నారు. గొర్రెలకు బీమా చేయించినపుడు సంబంధిత రైతుకు కూడా 50వేల వ్యక్తిగత బీమాపాలసీ అనుపర్తించేలా ఏర్పాట్లు చేశారు.

ఉపాధ్యాయ సంఘాలకు షాక్

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులపై ముఖ్యమంత్రి, ఉపాధ్యాయ సంఘాలకిచ్చిన మాట తప్పారు. ఈ వ్యవహారమై పది రోజులు సమ్మె చేసిన ఉపాధ్యాయుల కోర్కెలు తీరుస్తానన్న సిఎం ఇప్పుడేమో పదోన్నతులు ఇస్తాం; ఏ స్కూల్‌లో పనిచేస్తున్న వారు ఆ స్కూల్‌లోనే వుండాలి. వేసవి సెలవుల్లో బదిలీ చేస్తామంటూ తాజా షెడ్యూల్‌ను విడుదల చేయడంతో ఈ వ్యవహారాన్ని ఉపాధ్యాయ సంఘాలు తీర్చించుకోలేకపోతున్నాయి.

నెల్లూరు కళాకారులకు సన్మానం

నంది నాటకోత్సవ బహుమతి ప్రదానోత్సవ వేదికపై నాటకరంగంలో పేరు ప్రఖ్యాతులు గాంచిన జిల్లాలోని 11 మంది కళాకారులను మంత్రి రామనారాయణరెడ్డి సన్మానించారు. వీరిలో సురభి వనారస కోటేశ్వరమ్మ, టి.ఎస్. రాయలు, మజ్జిగ చంద్రబాల, సురభి వనారస కోటీశ్వరీదేవి, వి.సుందర రామయ్య, చంద్రసేన, బెల్లంకొండ రమణారావు, పగిడి ఓబయ్య, కుడా చెంచయ్య, యడవల్లి రాఘవయ్య, మొలకల గోపాలరెడ్డి వున్నారు.

పద్యనాటకాలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించిన పొన్నాల రామసుబ్బారెడ్డిని సైతం ఇదే వేదిక మీద సన్మానించారు.

మూలస్థానేశ్వరస్వామికి నూతన రథం!

నెల్లూరు మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వర స్వామి దేవస్థానంలో దాతలచే నిర్మాణం గావించబడిన నూతన రథ ప్రారంభోత్సవం ఫిబ్రవరి 2వ తేది జరుగుతుంది. రథాన్ని సమాచార మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభిస్తారని ధర్మకర్తల మండలి చైర్మన్ రేబాల వెంకటరెడ్డి చెప్పారు.

పరిటాల రవి వర్ధంతి

నెల్లూరులోని కాకతీయ జనసంక్షేమ సేవాసమితి 24వ తేది గాంధీ బొమ్మ సెంటర్‌లో మాజీ ఎమ్మెల్యే పరిటాల రవి 4వ వర్ధంతి సభను ఘనంగా జరిపింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వై.టి. నాయుడు మాట్లాడుతూ పరిటాల రవి అనంతపురం జిల్లాలో పేద, బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలబడి పనిచేయడం వల్లే నేటికీ అనంతపురం జిల్లాలో తెలుగుదేశం పార్టీకి తిరుగు లేదన్నారు. తెలుగు రైతు రాష్ట్ర నాయకుడు ఆలూరి వెంకటేశ్వర్లు నాయుడు, తెలుగు యువత ప్రచార కార్యదర్శి ఎల్.బాబు, మదార్, పఠాన్ అన్వర్, కాకతీయ జనసంక్షేమ సేవాసమితి అధ్యక్షుడు వై.ఎస్.చౌదరి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ముస్లింల సామూహిక వివాహాలు

జిల్లా వక్ఫ్‌బోర్డు నేతృత్వంలో 150 మంది పేద ముస్లిం జంటలకు సామూహిక వివాహాలు ఫిబ్రవరి నెలలో బారాషాహీద్ దర్గా ఆవరణలో జరుపనిశ్చయించినట్లు వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు ఎస్.ఏ.ఎం.హుస్సేనీ చెప్పారు. ఈ కార్యక్రమంలో నిఖా చేసుకోవాలని భావించే వారు జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యాలయం, బోర్డు డైరక్టర్ల వద్ద దరఖాస్తు ఫారాలను పొందవచ్చున్నారు.

ఎఎస్పీగా వీరారెడ్డి!

నెల్లూరు రూరల్ డిఎస్పీ వీరారెడ్డికి అదనపు ఎస్పీగా పదోన్నతి రాబోతుంది. ఆయన్ను నెల్లూరు ఎఎస్పీగానే నియమించనున్నట్లు తెలిసింది.

వెంకటగిరి సిఐ రామకృష్ణ, ఎస్‌బి సిఐ శ్రీనివాసులు, కావలి సిఐ రజనీకాంతరెడ్డి, గూడూరు సిఐ మాల్యాది, ఉదయగిరి సిఐ సుందర రావు, క్రైం సిఐలు కృష్ణార్జునరావు, డి.వెంకటేశ్వర్లు, విజిలెన్స్ సిఐ బాబులు డిఎస్పీలుగా పదోన్నతి ఉత్తర్వులు వారం రోజుల్లో అందుకోనున్నారు.

ఇందిరాభవన్‌లో జనవరి 26 వేడుక!

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇందిరాభవన్‌లో జాతీయ పతాకాన్ని జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు బొబ్బల శ్రీనివాస్‌యాదవ్ ఎగురవేశారు. ఎన్నికల సంవత్సరంలోనూ ఇందిరా భవన్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఒక్క మంత్రికానీ, ఎమ్మెల్యే కానీ హాజరు కాలేదు. గణతంత్ర భారతావనిపై ఈ ప్రజాప్రతినిధులకున్న గౌరవాన్ని సంఘటన చాటిచెప్పిందనాలి.

లోక్‌సత్తాకు కొత్త కార్యవర్గం

లోక్‌సత్తా పార్టీ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొంది. అధ్యక్షులుగా ఎన్.శ్రీధర్, ఉపాధ్యక్షులుగా వి.దినకర్ రెడ్డి, పి.గీతారెడ్డి, సి.నాగరాజు, సయ్యద్ రసూల్, కార్యదర్శిగా ఎం.విజయలక్ష్మి, సహాయ కార్యదర్శులుగా ఎన్.రామకృష్ణారెడ్డి, ఐ.మహీధర్, కె.అశోక్ కుమార్, వి.రమేష్‌కుమార్, కోశాధికారిగా కె.రామారావులను ఎన్నుకొన్నారు. ఎన్నికల అధికారిగా వీరేపల్లి రామచంద్రయ్య వ్యవహరించారు.

చతుర్థ వర్ధంతి



శ్రీమతి నాయుడు నిర్మల గారు

మంచికి మారు పేరుగా నిలిచి
అందరికీ అప్యాయతానురాగాలు పంచి పెట్టిన

శ్రీమతి నాయుడు నిర్మల గారు

స్వర్గస్తులై 07-02-2005 తేది నాటికి నాలుగు సంవత్సరములు నిండుతున్న సందర్భంగా వారి పవిత్ర ఆత్మకు చిరశాంతిని ప్రసాదించమని భగవంతుని ప్రార్థిస్తున్నాము.

భర్త
నాయుడు వెంకట నరసారెడ్డి
(నెల్లూరు)

కుమార్తెలు - అల్లుళ్లు
బాలిరెడ్డి పవిత్ర - డా॥ దుర్గాప్రసాద్‌రెడ్డి, M.Ch.,
కాటంరెడ్డి హేమ - వివేకానందరెడ్డి, M.C.A

మనుమలు - మనుమరాలు
మోక్షిత్‌శ్రీ - సుబ్బరామిరెడ్డి

అమ్మ ఫర్నిచర్స్
"A House of Life style furnitures"

బంగారం స్పెషల్ ఆఫర్
BIS 916 హాల్‌మార్క్ బంగారు ఆభరణములపై
సవరకు రూ.400/- తగ్గింపు.
గ్రాముకు రూ.50/- తగ్గింపు.
డైమండ్స్‌పై 10% తగ్గింపు.
గుల్ల జ్యూవలరీ



కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో మినిట్స్‌బుక్‌ను లాక్కుంటున్న కార్పొరేటర్ మేకల నరేంద్రరెడ్డి.

తెలుగు తమ్ముళ్ల కీచులాట!

అసలే అస్తుబిస్తుగా వున్న జిల్లా తెలుగుదేశం పార్టీని మరింత భ్రష్టు పట్టిస్తున్నారు తెలుగు తమ్ముళ్లు. అలవాటుకు భిన్నంగా, ఏ పార్టీ సాహసించని తీరులో ఎన్నికలకు నాలుగు నెలల ముందే ఏ నియోజకవర్గానికి ఎవరు అభ్యర్థులో ప్రకటించి సాహసోపేతంగా వ్యవహరించాడు చంద్రబాబు. వెంకటగిరి, గూడూరు వంటి ఒకటి రెండు చోట్ల తప్ప తతిమా అన్ని నియోజక వర్గాలకూ అభ్యర్థుల సూచన చేశాడు. ఇంత ముందుగా రాజకీయ స్పష్టత లభించినప్పుడు ఏ పార్టీ అయినా, ఉత్సాహంతో ఎన్నికలకు సమాయత్తం కావాలి. కానీ పరిస్థితి అందుకు విరుద్ధంగా వుంది. కార్యకర్తలను సమీకరించి, ప్రజలకు సన్నిహితం కావడానికి బదులుగా, తమలో తాము కలహించుకొంటూ పార్టీని బజారున పెడుతున్నారు.

నెల్లూరు నగర అభ్యర్థి తాళ్లపాక రమేష్‌రెడ్డి అని తేటతెల్లంగా చెప్పారు. రమేష్‌రెడ్డికి బాలకృష్ణ వద్ద వున్న చనువుతో లభించిన వరం అది. మామూలు పరిస్థితులలో అయితే రమేష్‌కు టిక్కెట్ మహా గగనం. గత ఎన్నికలలో కూడా రమేష్‌రెడ్డిని పక్కన పెట్టడానికి ఉద్దేశపూర్వకంగా నెల్లూరు స్థానాన్ని బిజెపికి కేటాయించారాయన. పార్టీలో తనకున్న ఆ చెడ్డ పేరును తప్పించుకొని టిక్కెట్ తెచ్చుకొన్నందుకు రమేష్‌రెడ్డి ఎన్నికల ఏర్పాట్లలో తలమునకలు కావాలి. కానీ ఆయన మాత్రం జిల్లా అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి మీద, టిక్కెట్‌కు తనతో పోటీ పడిన వైటి నాయుడు మీద చాడీలు మోస్తూ కాలక్షేపం చేస్తున్నాడు.

నగర పరిధిలో తను తప్ప మరెవ్వరూ కార్యక్రమాలు జరపడానికి లేదని ఆంక్ష విధించాడు. తాను మాత్రం చిన్నపాటి కార్యక్రమం కూడా చేపట్టడం లేదు. దానితో కార్యకర్తల పరిస్థితి అయోమయంగా మారింది.

> ఏ పార్టీ సాహసించని రీతిలో ఎన్నికలకు నాలుగు నెలల ముందు అభ్యర్థులను ప్రకటించినా కార్యకర్తలను సమీకరించి ప్రజలకు సన్నిహితం కావడానికి బదులు తమలోతాము కలహించుకొంటున్నారు తెలుగు తమ్ముళ్లు.

నెల్లూరు రూరల్ స్థానం కమ్యూనిస్టులకు కేటాయించినట్లు భావించాలి. అది తప్ప వేరే సీటుకు వారు సిద్ధపడరు. అయితే, అక్కడున్న తెలుగుదేశం కార్యకర్తలను సమీకరించి కమ్యూనిస్టులకు పని చేయించడం చిన్న పని కాదు. ఆ బాధ్యత మాజీ కార్పొరేటర్ వెంకటస్వామి నాయుడుకి అప్పచెప్పాడట చంద్రబాబు. అయితే అది జిల్లా అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి ఇష్టం వున్నట్లు లేదు. దానితో వెంకటస్వామి కాళ్లు చేతులు కట్టిపడేశాడు. వేరే వారికి ఆ బాధ్యత అప్పచెప్పే చొరవ మాత్రం తీసుకోవడం లేదు.

ఉదయగిరిలో విజయరామరెడ్డి అంటే, స్థానిక కమ్మ కులస్తులకు సరిపడదు. చంద్రబాబు మాత్రం అతడే అభ్యర్థి అన్న సూచన ఇచ్చాడు. దానితో అక్కడి తెలుగుదేశం స్థానిక నేతలంతా విజయరామరెడ్డికి వ్యతిరేకంగా పని చేస్తున్నారు. కోవూరు అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమారరెడ్డికి కూడా పార్టీ నుంచి పూర్తి స్థాయి సహకారం లభించడం లేదని వినికిడి. ఇందుకూరుపేట తెలుగు తమ్ముళ్లంతా ఆయన పట్ల ఎడముఖం, పెడముఖంగా వుంటున్నారట. గూడూరులో పార్టీ బాధ్యత తీసుకోవడానికి నల్లపరెడ్డి కుటుంబ సభ్యులు ముందుకు రావడం లేదు. మాజీ ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్, తనకు టిక్కెట్ ఖరారు చేస్తేనే వీధిలోకి వస్తానని ఇంట్లో ముడగతీసుకొని పడుకొని వున్నాడట.

నెల్లూరు పరువు పెన్నలో కలుస్తోంది!

నెల్లూరు మునిసిపల్ వ్యవహారాల గురించి వ్రాయాలంటేనే మనసులో వికారం కల్గుతున్నది. మనుషులకైతే, ఒకటికి పదిసార్లు చెప్పవచ్చు; కానీ పశువులుగా మారిన వారికి మాటలు, వార్తలు తలకెక్కుతాయా? మేయర్ పులిమి శైలజారెడ్డి మీద ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి చేస్తున్న ఆగడాలు రోజురోజుకూ అసహ్యం స్థాయిని మించి జుగుప్స దశకు చేరుకొంటున్నాయి. సభ్యత సంస్కారాలు, వుచ్చనీచాలు, సిగ్గు ఎగ్గు అన్నీ వదిలేస్తున్నారు ఆమె విషయంలో. ఇప్పటికి జరిగిన హేయమైన సంఘటనలు చాలలేదేమో, తాజాగా మరొకసారి మేయర్ మీద వీధి రౌడీతనం ప్రదర్శించారు. 28తేది సాయంత్రం కార్పొరేషన్ ఆఫీసులో జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో కాంగ్రెస్ కార్పొరేటర్ మేకల నరేంద్రరెడ్డి ఫుల్లుగా మందు బిగించి, వళ్లు తెలియని స్థితిలో మేయర్ మీద దాడికి పూనుకొన్నాడు. సమావేశం జరగనివ్వకుండా పదే పదే అడ్డుపడడంతో పాటు, ఆమెను నీచమైన భాషలో నిందించాడు. ఆ బూతు పురాణం వినలేక సమావేశాన్ని మధ్యలోనే వాయిదావేసి వెళ్లిపోయారు మేయర్. కమీషనర్ వంటి అధికారులు నచ్చచెప్పి మళ్లీ సమావేశానికి తీసుకవస్తే, తిరిగి అదే ధోరణి. ఒకదశలో ఆమెపై భౌతికమైన దాడికి తెగబడ్డాడు. ఆమె చేతిలోని మీటింగ్ మినిట్స్ పుస్తకం పెరుక్కొని, చించి పారేశాడు. అదే సమావేశంలో వున్న సిపిఎం కార్పొరేటర్ కత్తి శ్రీనివాసులు, ఈ దౌష్ట్యాన్ని సహించలేక మేయర్‌కు మద్దతు పలకబోతే, అతడి మీద కూడా దౌర్జన్యానికి దిగారు. మునిసిపల్ రాజకీయాలను ఇంత బజారు కెక్కించడం వల్ల మేయర్‌కు జరిగే అవమానాల కంటే, తనకు జరిగే రాజకీయ నష్టమే ఎక్కువన్న స్పృహ

తొరవ 14వ పేజీలో

నంది నాటకాల రామాయణంలో భానుశ్రీ పిడకలవేట!

సమాచార మంత్రిగా తనకు లభించిన అరుదైన అవకాశంతో నెల్లూరులో నంది నాటకోత్సవాలను ఘనంగా జరిపించాలని ఆశపడ్డాడు ఆనం రామనారాయణరెడ్డి. అందుకు చాలా శ్రమపడి ఏర్పాట్లు చేశాడు. కస్తూరిబా కళాక్షేత్రాన్ని ముప్పై లక్షలు పెట్టి మరమ్మత్తులు చేశారు. ఉత్సాహపూరిత వాతావరణంలో జరగవలసిన ఈ ఉత్సవాలు చివరకొచ్చేసరికి అభాసుపాలై పోయాయి.


కార్యక్రమం ప్రకారం వీటికి జిల్లా మంత్రిణి నేదురుమల్లి రాజ్యలక్ష్మమ్మ జ్యోతి వెలిగించి ప్రారంభించాలి. కానీ నెల్లూరులో ఆనం వారి ఆధ్వర్యంలో జరిగే సభలో తనకెంత మాత్రం గౌరవం దక్కుతుందో బాగా అనుభవానికి తెచ్చుకొన్న ఆమె, గైర్హాజరైనారు. దానితో, కార్పొరేటర్ భానుశ్రీ చేత జ్యోతి వెలిగింప చేయమని ఆదేశించాడట ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి. కార్యక్రమ నిర్వాహకుడైన జిల్లా అధికారి రవిప్రకాష్ అందుకు సమ్మతించలేదు. వివేకానందరెడ్డి పట్టువదలకుండా, దబాయింపుకు దిగడంతో, ఒకదశలో నేను దళితుడిని కాబట్టా అట్లా మాట్లాడుతున్నావని ఎదురు తిరిగాడట ఆ అధికారి.

భానుశ్రీకి అవకాశం ఇవ్వనందుకు నిరసనగా వివేకానందరెడ్డి ఆ రోజు కార్యక్రమానికి ఆలస్యంగా వచ్చాడు. ఒకరిద్దరు తప్ప కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎవరు కూడా రాలేదు. రామాయణంలో పిడకల వేట మాదిరి, అసందర్భంగా భానుశ్రీ వివాదం రేకెత్తించి, గొడవ పెట్టుకోవడంతో మనస్థాపం చెందిన రామనారాయణరెడ్డి కూడా వక్కరోజు నుంచి ముఖం తప్పించి వెళ్లిపోయాడు.

శ్రద్ధాంజలి



శ్రీ దువ్వూరు శేషయ్య గారు
మాజీ అధ్యక్షులు, గౌరవ సలహాదారుడు
నెల్లూరు డిస్ట్రిక్ట్ బులియన్ & డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్.
మా అసోసియేషన్ ఉన్నతికి అహరహం శ్రమించిన
స్వర్గీయ దువ్వూరు శేషయ్య గారి మరణం మాకు తీరనిలోటు.
వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ, వారి కుటుంబానికి సానుభూతి తెలియజేస్తున్నాము.
అధ్యక్షులు: శాంతిలాల్ జైన్ కార్యదర్శి: అలిమిలి మాధవయ్య ఆచారి
నెల్లూరు డిస్ట్రిక్ట్ బులియన్ & డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్



కార్పొరేషన్ ఆఫీసు వద్ద సిపిఎం కార్యకర్తలపై పోలీసు దౌష్ట్యం.

పోలీసుకు ఎందుకంత చేతిదురదకు?

నెల్లూరు పోలీసులకు ఈ మధ్య దుందుడుకుతనం ఎక్కువై పోతున్నది. సాధారణ జనం మీద తమ ప్రతాపం చూపడం ఒక వినోదంగా మారుతున్నది. 28తేది సాయంత్రం కార్పొరేషన్ ఆఫీసు ఎదుట సిపిఎం పార్టీ కార్యకర్తలు ఒక ధర్నా తలపెట్టారు. అనితా హాల్ దగ్గర ఇసుకతో సిమెంట్ రోడ్డు వేసిన ఘోరం మీద విచారణ జరపాలని అధికారులను కోరడానికి చేపట్టిన సాధారణ ధర్నా అది. ప్రతిపక్షంలో వుండే పార్టీలు ప్రజా సమస్యల మీద ధర్నాలు, ప్రదర్శనలు చేయడం సర్వ సాధారణ విషయం. అందులో తప్పు పట్టవలసింది, అభ్యంతర పెట్టవలసింది ఏదీ లేదు. కానీ ఎందువల్లనో ఈ ధర్నా మీద పోలీసులు లాఠీలతో విరుచకపడ్డారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారి, అదుపు తప్పి, శాంతిభద్రతల సమస్య ఏర్పడితే పోలీసు జోక్యం చేసుకోవచ్చు. కానీ తమలో తాము నినాదాలు చేసుకొంటున్న

తొరవ 14వ పేజీలో

ద్వారకా నగర్‌లో ప్లాట్లు అమ్మబడును

మైపాడురోడ్డు, 4వ మైలు సెంటర్ నుండి 1/2 K.M. లోపు ఇండ్ల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో

- 100% వాస్తు
- NH5 బైపాస్ నుండి 1½ K.M.
- 15 అడుగులలో మంచినీరు
- అన్ని రోడ్లకు విద్యుత్ సౌకర్యం


వై. జయరామిరెడ్డి సెల్: 94407 29762

ఆర్‌అండ్‌బి కార్యాలయం అవినీతిమయం!

"నెల్లూరు డివిజన్ పరిధిలోని రోడ్ల నిర్మాణాలను పర్యవేక్షించాల్సిన రోడ్లు భవనాలశాఖ కార్యాలయంలో పని చేసే సిబ్బంది ప్రతి పనికి ఒకరేటు నిర్ణయించి భారీ స్థాయిలో కమీషన్లు గుంజుతూ కాంట్రాక్టర్లకు పనులు కేటాయిస్తున్నారు."

నెల్లూరు డివిజన్ పరిధిలోని రోడ్ల నిర్మాణాలను పర్యవేక్షించాల్సిన రోడ్లు, భవనాలశాఖ కార్యాలయం మొత్తం అవినీతి నిలయంగా మారిపోయింది. ఈ డివిజన్ కార్యాలయం పరిధిలో రోడ్ల నిర్మాణం చేపట్టే కాంట్రాక్టర్ల నుంచి అధిక మొత్తంలో కమీషన్లు తీసుకొంటున్నారు సిబ్బంది. ప్రతిపనికి ఒకరేటు నిర్ణయించి వసూలు చేసుకొంటున్నారు. ఆర్‌అండ్‌బి ఇంజినీర్లు, కార్యాలయ సిబ్బందికి కమీషన్లు ఇవ్వాల్సిరావడం వల్ల నాసిరకం మెటీరియల్‌తో రోడ్ల నిర్మాణ పనులు చేస్తున్నారు కాంట్రాక్టర్లు.

టెండర్ ఫారం దగ్గర నుంచి వర్క్ ఆర్డర్ ఇచ్చే వరకు ప్రతి సెక్షన్‌లో మామూళ్లు సమర్పించుకోవాల్సి వుంటుంది. రోడ్ల నిర్మాణాలు చేపట్టే ఈ శాఖ అధికారులు, కాంట్రాక్టర్లు సమర్పించే కమీషన్లకు బాగా అలవాటు పడిపోయారు. నెల్లూరు డివిజన్ పరిధిలో దెబ్బతిన్న రోడ్లు, నిర్మాణం చేపట్టాల్సిన రోడ్ల వివరాలు సేకరించి ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు తయారు చేయడం అసిస్టెంటు ఇంజినీర్ల బాధ్యత. ప్రతిపాదనలను సంబంధిత సూపరింటెండెంట్ ఇంజినీర్ ద్వారా ప్రభుత్వానికి పంపి అవసరమైన అనుమతులు పొందుతారు. రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు తయారు చేసే దగ్గర నుంచి అనుమతి లభించే వరకు కాంట్రాక్టర్లు ఈ కార్యాలయం చుట్టూ తిరుగుతూ వుంటారు.



నెల్లూరులోని రోడ్లు భవనాలశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు కార్యాలయం.

టెండరు నోటీసు తయారుచేసి, టెండరు పిలిచే వరకు హెడ్ డ్రాఫ్ట్స్‌మెన్ కీలకపాత్ర పోషిస్తాడు. టెండరు ఎంత వరకు కొటేషన్ వేయాలన్న సమాచారాన్ని ముందు ఆయనకు సన్నిహితంగా వుండేవారికి అందిస్తుంటాడు. కోట్ల రూపాయలు విలువ చేసే పనులను ఎలాగైనా దక్కించుకోవాలన్న లక్ష్యంతో కొన్ని సందర్భాలలో సిండికేట్‌గా ఏర్పడుతుంటారు కాంట్రాక్టర్లు. రోడ్డు కాంట్రాక్టును దక్కించుకొనేందుకు అవసరమైతే ఎమ్మెల్యేలు, మంత్రుల ద్వారా సిఫార్సులను చేయిస్తుంటారు. ఆర్‌అండ్‌బి ఇంజినీరింగ్ విభాగం అధికారుల నిర్లక్ష్యం కారణంగా కోట్ల రూపాయలు ఖర్చుచేసి వేసిన రోడ్లు కొద్ది నెలలకే దుస్థితికి చేరుకొంటున్నాయి.

దీనికి ఉదాహరణగా నెల్లూరు - ముత్తుకూరు రోడ్డును పేర్కొనవచ్చు. వడ్డిపాళెం నుంచి కాకుపల్లి వరకు ఈ రోడ్డు బాగా దెబ్బతిన్నది. దెబ్బతిన్న ప్రాంతంలో ఆర్‌అండ్‌బి ఇంజినీర్లు తూతూ మంత్రంగా మరమ్మత్తులు చేపట్టి పూర్తిచేయడం జరిగింది. మరమ్మత్తులు చేసిన రెండు నెలలకే మళ్లీ ఈ రోడ్లు దుస్థితికి చేరుకొన్నాయి. బినామీ కాంట్రాక్టర్లను సృష్టించి మరమ్మత్తులు పూర్తి చేసినట్లు రికార్డులలో నమోదు చేసుకోవడం ఇంజినీర్లకు ఆనవాయితీ. బిల్లులు మంజూరు చేసే ప్రతిసారి కమీషన్లు ఇవ్వాల్సి వస్తుండడంతో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలిస్తున్నారు.

ఆర్‌అండ్‌బి నెల్లూరు డివిజన్ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది, ఇంజినీర్లు కొద్దికాలంలోనే లక్షాధికారులవుతున్నారు. రోడ్ల నిర్మాణ టెండర్ దక్కించుకొన్న కాంట్రాక్టర్లు నిబంధనల ప్రకారం పనులు చేయాలన్నా వీలుకాని పరిస్థితులు ఎదురౌతున్నాయి. ఎందుకంటే సంబంధిత శాఖలోని సిబ్బందికి కమీషన్లు ఇవ్వాల్సి వున్నందున నాణ్యతగా రోడ్ల నిర్మాణం చేపట్టలేక పోతున్నామని కొంతమంది కాంట్రాక్టర్లు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. రోడ్లు నాణ్యతగా వేయకుంటే కొద్ది నెలలకే పాడైపోతాయన్న విషయం అందరికీ తెలిసిందే. రోడ్ల నిర్మాణం, మరమ్మత్తుల కోసం ప్రభుత్వం కేటాయిస్తున్న కోట్ల రూపాయల నిధులు ఈ శాఖధికారుల పంట పండిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్లు, భవనాల డివిజనల్ కార్యాలయ పరిధిలో చేపట్టిన పనులు, జరుగుతున్న పనులను పర్యవేక్షణ చేస్తే మరిన్ని అక్రమాలు వెలుగుచూసే అవకాశం వుంది.

కాంగ్రెస్ కార్యకర్తల సంక్షేమ నిధులు విడుదల!

మండలానికి 90లక్షల రూపాయల లెక్కన 46 మండలాలకు 41కోట్ల 40 లక్షలు విడుదల చేసిన ప్రభుత్వం.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పార్టీ జెండాలు మోసిన వారికి మొండి చెయ్యి చూపిందన్న విమర్శలున్నాయి. గ్రామస్థాయిలో కాంగ్రెస్‌పార్టీ నిర్మాణానికి అహర్నిశలు కృషిచేసిన కార్యకర్తలకు ఆర్థికంగా ఏదో ఒక విధంగా చేయూత నివ్వాలన్న వుద్దేశ్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టాడు. కార్యకర్తలకు, ద్వితీయశ్రేణి నాయకులకు ప్రభుత్వం వైపు నుంచి నిధులు మంజూరు చేసే అవకాశం లేకపోవడం వలన కాంట్రాక్టు పనులు కేటాయించాలని నిర్ణయం తీసుకొన్నారు.

ముఖ్యమంత్రికి వచ్చిన ఆలోచనను వెంటనే అమలు చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన అధికారుల చేత ప్రణాళికలు తయారు చేయించారు. మండలానికి 90లక్షల రూపాయల వంతున నిధులు కేటాయిస్తామని, ఈ నిధులను గ్రామస్థాయిలో పార్టీ కోసం పని చేసేవారికి కాంట్రాక్టు పనులు అప్పగించాలని ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి సూచించినట్లు సమాచారం. రానున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో వుంచుకొని మండలాలకు లక్షలాది రూపాయల నిధులు విడుదల చేస్తున్నాడు రాష్ట్రముఖ్యమంత్రి. ఒక్కో మండలానికి కేటాయించిన 90 లక్షల రూపాయల నిధులను ఆయా మండలాలలోని పంచాయితీల వారీగా విడుదల చేసే పనిలో నిమగ్నమైవున్నారు అధికారులు.

జిల్లాలోని 46 మండలాలకు 41కోట్ల 40 లక్షలరూపాయలు ప్రభుత్వం ఇటీవల విడుదల చేయడం జరిగింది. మండలాలకు విడుదలైన నిధులను గ్రామ పంచాయితీలకు కేటాయింప చేసుకొనేందుకు కాంగ్రెస్‌పార్టీ నాయకులు స్థానిక ఎమ్మెల్యేలపై వత్తిడి తీసుకవస్తున్నారు. పంచాయితీలకు విడుదల చేసిన నిధులతో డ్రైనేజికాల్వల నిర్మాణం, సిసి రోడ్ల నిర్మాణం, త్రాగునీటి సౌకర్యం తదితర అభివృద్ధి పనులు చేపడతారు. 5లక్షల రూపాయలు లోపు చేపట్టే పనులను నామినేషన్ పద్ధతిన కేటాయిస్తారు. 5లక్షలకు మించిన పనులకు మాత్రం టెండర్లు ఖరారు చేయాల్సి వుంటుంది.



నిధులు విడుదల చేసిన నెల్లూరు జిల్లా పరిషత్ కార్యాలయం.

గ్రామ పంచాయితీలకు నిధుల కేటాయింపులో కూడా మండలస్థాయి అధికారులు స్థానిక ఎమ్మెల్యే అభిప్రాయం తీసుకొంటున్నారు. ఎమ్మెల్యే సూచనల మేరకే గ్రామ పంచాయితీలకు నిధుల కేటాయింపు జరుగుతుంది. గ్రామ, మండలస్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు వివిధ పనుల పేరుతో నిధులు కైవసం చేసుకొనేందుకు ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షణాలు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారం చేపట్టి నాలుగున్నర సంవత్సరాలయ్యింది. ఇన్నేళ్ల తర్వాత ఎన్నడూలేని విధంగా మండలానికి 90లక్షల రూపాయల నిధులు విడుదల కావడంతో కాంగ్రెస్‌పార్టీ నాయకులలో ఆనందం వ్యక్తమవుతుంది.

గత ఆరునెలల నుంచి మండలాలకు నిధుల కేటాయింపుపై రాష్ట్ర ముఖ్యమంత్రి కసరత్తు చేస్తున్నారు. ఇంత కాలం తర్వాత నిధులు విడుదల ప్రక్రియ జరిగింది. మండలాలకు విడుదలైన నిధులతో పనులు చేజిక్కించుకొనేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలంటూ పంచాయితీరాజ్ ఇంజినీరింగ్ విభాగం అధికారులపై అప్పుడే ఒత్తిళ్లు ప్రారంభమయ్యాయి. మండలాలకు కేటాయించిన నిధులు కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులకు పంపిణీ

తారువ 14వ పేజీలో

చెరువుల దురాక్రమణ!

కాదేది ఆక్రమణకు అనర్హం అని నిరూపిస్తున్నారు భూకబ్జాదారులు. రోడ్డు, డొంక, చెరువు ఏదైనా సరే ఆక్రమకు గురౌతున్నది. విడవలూరు మండలంలో కబ్జాల పర్వం నిరాటంకంగా సాగుతోంది. సారవంతమైన

విడవలూరులో అడిగేవారు లేరు!

భూములు ఈ ప్రాంతంలో వుండడం, చెరువులను ఆక్రమించి సాగు చేస్తే దిగుబడులు విస్తారంగా వస్తాయన్న దాంతో ఆక్రమణలు ఎక్కువవుతున్నాయి. రాజకీయంగా పలుకుబడిగల వారు ఈ చెరువులను ఆక్రమించుకోవడంతో అధికారులు చేతులెత్తేస్తున్నారు. దీనివలన చెరువుల క్రింద సాగు చేసిన రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. మరోవైపు ఆక్రమణదారులకు కొందరు అధికారులు సహాయసహకారాలు అందిస్తుండడంతో విద్యుత్ కనెక్షన్లు, రోడ్లు వేసేస్తున్నారు. వావిళ్ల

తరువ 14వ పేజీలో



నెల్లూరు డైకస్‌రోడ్డులోని మట్టికుండల దర్గాలో జరిగిన గంధోత్సవంలో భక్తజనసందోహం.

స్థానికులకు మొండిచేయి!

పారిశ్రామికంగా తమ సంస్థల స్థాపనతో అభివృద్ధి వుంటుందని, స్థానిక యువకులకు ఉద్యోగం కల్పిస్తామని తద్వారా వారి జీవితాలలో వెలుగులు నింపుతామని కార్పొరేట్ సంస్థలు, పలు కంపెనీలు చెప్పిన మాటలు నీటి మూట

పోర్టులో ఎవరికి వుద్యోగాలిచ్చారు?

లవుతున్నాయి. ఎస్ఇజడ్‌ల పేరుతో కంపెనీలు ఏర్పాటు చేస్తామని చెప్పి, తీరా వాటిని ఏర్పాటు చేశాక స్థానికులకు మొండిచేయి చూపిస్తున్నాయి అనేందుకు ముత్తుకూరు మండలాన్ని ఉదాహరణగా చెప్పొచ్చు. కృష్ణపట్నంలో నిర్మించిన పోర్టులోగాని, త్వరలో నిర్మాణం కానున్న రిలయన్స్ థర్మల్ విద్యుత్ కేంద్రంలో గాని స్థానికులకు ఉద్యోగ అవకాశం లభించడం లేదు. పోర్టులోను చాలా తక్కువ మంది స్థానికులకు అవకాశం కల్పించారని ఇప్పటికే పలు విమర్శలు వస్తున్నాయి. ఈ తరు

తరువ 14వ పేజీలో

బుచ్చి పోలీసుల సివిల్ పంచాయతీలు!

జిల్లాలో ఎక్కడా లేనివిధంగా బుచ్చి పోలీసులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ పలు వివాదాల్లో చిక్కుకొంటున్నారు. సివిల్ పంచాయతీలు, ప్రేమ పెళ్ళిళ్లు స్టేషన్‌లకు వచ్చాయంటే పోలీసులు రెండుచేతులా సంపాదిస్తున్నారు. కాసులకు కక్కుర్తిపడి ప్రతి కేసులోనూ పంచాయతీలు చేస్తుండడంతో కొన్ని పోలీసుల మెడకు చుట్టుకొంటున్నాయి.. పాత మినగల్లుకు చెందిన మహిళను దొంగతనం కేసులో తీసుకొని వచ్చి వారం రోజులపాటు స్టేషన్‌లో వుంచి చిత్రహింసలు పెట్టారు. అది వివాదమై ఎస్ఐ, ఎఎస్ఐలు సస్పెండ్ అయ్యేదాకా

శృతిమించాయి

వెళ్ళింది. పంచేడుకు చెందిన వ్యక్తి హత్య, మునులపూడికి చెందిన రామకృష్ణ హత్య, తదనంతరం పోలీసులు వ్యవహరించిన తీరు విమర్శలకు తావిచ్చింది. ఎంఆర్‌పిఎస్ నాయకులు స్టేషన్ ముందు ధర్నా చేశారు. ఇప్పటికీ ఆ కేసులో హంతకులు దొరికినా మృత దేహం లభ్యంకాలేదు. వడ్డిపాళానికి చెందిన గిరిజన బాలిక తనను పెళ్ళి చేసుకొంటానని నమ్మించి మోసగించిన వ్యక్తికి పోలీసులు సహకరించడంతో ఏకంగా ఎస్ఐ మీదే ప్రైవేట్ కేసు దాఖలు చేసింది. ఇలా సివిల్ పంచాయతీలలో పోలీసుల మితిమీరిన జోక్యం వివాదాలను తెచ్చిపెడుతున్నా వారి బుద్ధి మారడం లేదు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని బుచ్చి పోలీసుల తీరు మార్చాల్సి వుంది.



నెల్లూరులో జరిగిన మాజీ ఎమ్మెల్యే పరిటాల రవి వర్ధంతి సభలో నివాళులర్పిస్తున్న తెలుగుదేశం పార్టీ నేత వైటి.నాయుడు తదితరులు.



పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో జరిగిన రిపబ్లిక్‌డే దినోత్సవపు వేడుకల్లో పాల్గొన్న ఓ అమెరికన్ చిన్నారి భారత జాతీయపతాకాన్ని ప్రదర్శిస్తున్న దృశ్యం.

ఇందిరమ్మ లబ్ధిదారులకు కష్టాలు!

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అధికారుల తీరువలన లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సొంత ఇంటిని నిర్మించుకోవాలన్న తపన, ఆశ బిల్లులు మంజూరు కాకపోవడంతో ఆవిరైపోతున్నది. జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాలలో ఈ సమస్య ఉత్పన్నమౌతున్నది. కోట మండలంలో ఈ పరిస్థితి అధికంగా వుంది. మండలంలోని పలు గ్రామాలలో మూడో విడత ఇందిరమ్మ గృహాల నిర్మాణాలు అర్ధాంతరంగా ఆగిపోయాయి. కోట, తిన్నెలపూడి, కేశవరం గ్రామాలు ఇందిరమ్మ గ్రామాల క్రింద ఎంపికయ్యాయి.

పనులు పూర్తయినా బిల్లులివ్వలేదు.

1600 పక్కా గృహాలు మంజూరు అయ్యాయి. అధికారులు ఈ గృహాలకు సంబంధించిన మార్కింగులు ఇవ్వడమే కాకుండా సిమెంటును మంజూరు చేశారు. పేద ప్రజలు పక్కా గృహాలు రానున్నాయన్న ఆశతో పున్న పూరిపాకలను పీకిపీసి, పక్కా గృహనిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. కొందరు పునాదుల

తరువ 14వ పేజీలో

సెలవులో ముత్తుకూరు తహశీల్దార్!

మండలంలో ప్రధాన అధికారైన తహశీల్దార్ లేక ప్రజలు అవస్థలు పడుతున్న స్థితి ముత్తుకూరులో చోటు చేసుకొంది. కృష్ణపట్నం పోర్టు, విద్యుత్ కేంద్రాల నిర్మాణం తదితర కీలకమైన సంస్థలు, పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న మండలంలో కేంద్ర బిందువుగా వ్యవహరించే తహశీల్దార్ గత మూడు నెలలుగా లేకపోవడంతో పాలన అస్తవ్యస్తంగా మారింది. కృష్ణపట్నం భూములకు సంబంధించి ఇంతవరకు పరిహారం అందని రైతులు ఒక వైపు, సామాన్య ప్రజలు, రైతాంగం ప్రతి ఒక్కరూ తహశీల్దార్‌తో పని వుండి ఆయన అనుమతితో జరుగనున్న పనులు

ఇబ్బంది పడుతున్న మండల ప్రజలు

మొత్తం స్తంభించి పోయాయి. పట్టాదారు పాస్‌పుస్తకాల కోసం అయితే రైతులు నెలల తరబడి తహశీల్దార్ కార్యాలయం చుట్టు తిరుగుతున్నా పట్టించుకొనేవారు లేకుండాపోయారు. రుణాల కోసం బ్యాంకర్లు ఆ పుస్తకాలను అడుగుతున్నారని, కార్యాలయంలో మాత్రం సమాధానం చెప్పే

తరువ 14వ పేజీలో



రిపబ్లిక్‌డే పెరేడ్‌లో చక్కని సాంస్కృతిక ప్రదర్శనలిచ్చిన నెల్లూరు వియాని హోంలోని బుద్ధిమాంద్యంతో బాధపడే చిన్నారులు.



నెల్లూరు ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ ఎం.నాగార్జున.



రిపబ్లిక్ డేను పురస్కరించుకొని నెల్లూరు మాగుంటలేఔట్‌లోని వేదవ్యాస స్కూల్‌లో నిర్వహించిన గాలిపటాల పండుగలో చిన్నారులతో స్కూల్ కరస్పాండెంట్ బాలాజి.

జలదంకిలో ఎండుతున్న పైరు

జలదంకి మండలంలో సోమశిల ఆయకట్టు పరిధిలోని పంట పొలాలకు నీరందక పోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో విలవిల్లాడుతున్నారు. నీరు లేక పంటలు ఎండిపోతుండడంతో ఏమి చేయాలో పాలుపోక రైతులు ఆందోళన చెందుతున్నారు. సోమశిల జలాశయంలో నీరున్నా నాన్‌డెల్టా

చివరి తడికి నీళ్లు కావాలి

ప్రాంతమైన కావలి కాలువ ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందడం లేదు. దాదాపు ఈ ఆయకట్టు క్రింద 25వేల ఎకరాలు వున్నాయి. వీటికి నీరు అందకపోవడంతో పైర్లు ఎండి పోతున్నాయి. మండలంలోని బ్రాహ్మణ క్రాక, గౌరవరం మేజర్ కాలువ క్రింద 10వేల ఎకరాల్లో సాగు చేసిన వరిపైరు చిరు పొట్టదశలో వుంది. సాగునీరు ఎక్కువగా అవసరమైన దశలో చుక్క నీరు లేక నేల నెర్రెలు బారడంతో అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. కావలి కాలువకు జలయజ్ఞంలో భాగంగా నిధులు మంజూరైనప్పటికీ కాలువ లోపల లైనింగ్, పెన్నానదిపై సంగం వద్ద బ్యారేజీ నిర్మాణ పనులు చేపట్టక పోవడంతో అవసరమైనంత నీరు కాలువలో పారడం లేదు. సంగం ఆనకట్ట వద్ద కాలువ సామర్థ్యం మేరకు నీటిని విడుదల చేస్తున్నప్పటికీ లోతు తక్కువగా వున్నందున కాలువలోకి నీరు రాక, లోతు ఎక్కువగా వున్న కనిగిరి రిజర్వాయర్‌కు వెళ్తుండడంతో రైతులు సాగు చేసిన పంటలకు నీరు అందడం లేదు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారింది.



బుచ్చిలో తెలుగుదేశం పార్టీ నిర్వహించిన ప్రజాదీవెన కార్యక్రమంలో నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి. ప్రక్కన గోవర్ధన్‌రెడ్డి, ఆర్.కె.రవికుమార్, సూదల వెంకటరమణయ్య.

ప్రచారం మొదలుపెట్టిన ప్రసన్న!

ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో కోవూరు దేశం అభ్యర్థిగా చెప్పుకొంటున్న నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పలు ప్రాంతాలలో పర్యటిస్తూ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ప్రజాదీవెన పేరిట చేపట్టిన ఈ కార్యక

పార్టీ శ్రేణులతో మీటా మింత

మంలో భాగంగా ఇటీవల బుచ్చి పట్టణంలో పర్యటించాడు. 40 వేల జనాభావున్న పట్టణంలో భాజానగర్ తప్పించి మిగతా ప్రాంతాలైన రామకృష్ణనగర్, శాంతినగర్, రాఘవరెడ్డికాలనీ, గిరిజా హాలు సెంటర్, పెద్దూరు, రిజిస్ట్రార్ ఆఫీసు సెంటర్, గాంధీనగర్ ప్రాంతాలలో తెలుగుదేశానికి మంచి క్యాడర్ వుంది. ఈ నాలుగున్నరేళ్లలో వీరిని పట్టించుకొనేవారు లేక, పనులు చేసేవారు లేక స్రబ్ధుగా వుండిన వీరికి, నియోజకవర్గాల పునర్విభజనలో బుచ్చి పట్టణం కూడా కోవూరు క్రిందకు రావడం, ప్రసన్న పరిచయ కార్యక్రమం నిర్వహించడంతో మంచి స్పందన లభించింది. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు అర్థమయ్యేలా చెప్పి వారిని ఆకట్టుకొన్నారు ప్రసన్న. అయితే ప్రసన్న ఒకవర్గానికే ప్రాధాన్యమిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిని చక్కదిద్దుకొని అన్ని వర్గాలను కలుపుకొని పోయినట్లయితే ప్రజల నుంచి మంచి మద్దతు లభిస్తుంది.

రియల్ ఎస్టేట్ వ్యాపారం తిరోగమనం!

రియల్ ఎస్టేట్ వ్యాపారానికి రెక్కలు రావడం, భూములు కోట్ల రూపాయల ధర పలకడం తెలిసిందే. ఒక్క రోజులో కోట్లకు పడగలెత్తిన వారు వున్నారు. ఒక్క వెలుగు వెలిగిన రియల్ వ్యాపారం ఇప్పుడు ఒక్కసారిగా పడిపోవడంతో భూములను కొన్నవారు, వ్యాపారులు దిక్కుతోచని స్థితిలో వున్నారు. జిల్లాలో ఇతర ప్రాంతాల కంటే అధికంగా ముత్తుకూరు మండలంలోని భూములు విపరీతమైన ధర పలికాయి. ఈ ప్రాంతంలో కృష్ణపట్నం పోర్టు, ధర్మల్ విద్యుత్ కేంద్రాల వల్ల ఎకరా వేల రూపాయలు వున్న భూములు కోట్ల రూపాయల్లోకి వెళ్లింది. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుండడంతో పలు ప్రాంతాల వారు ఇక్కడకు వచ్చి కోట్లు వెచ్చించి భూములను సొంతం చేసుకొన్నారు. భూముల యజమానులు, కొనుగోలు చేసే వారి కంటే దళారులే రెండు చేతులా సంపాదించారని చెప్పొచ్చు. దళారుల మాయ మాటలు నమ్మి పంచాయితీ అప్రూవల్ వుందో లేదో చూసుకోకుండానే లక్షలు పెట్టి స్థలాలను, భూములను సొంతం చేసుకొన్నవారు. తీరా భూముల ధరలు దిగబ్రాకడంతో లబోదిబోమంటున్నారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారం మందగించడం, పెట్టిన పెట్టుబడులు తిరిగిరాక, వడ్డీలకు తెచ్చి వ్యాపారం చేసేవారు దిక్కుతోచని స్థితిలో వున్నారు. తిరిగి ఎప్పటికి ఇది పుంజుకొంటుందో, లాభాలు మాట దేముడెరుగు పెట్టిన మొత్తాలు

ముత్తుకూరులో బాగా పడిపోయిన భూముల ధరలు

తిరిగొచ్చి నష్టాలపాలు కాకుండా వుంటే చాలని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోట్ల రూపాయలు పెట్టి భూములను కొన్నవారు ఇప్పుడు ధర పడిపోవడంతో తమ పరిస్థితి ఏంటి అని సందిగ్ధంలో వున్నారు. మొత్తం మీద పారిశ్రామిక ప్రగతి పేరుతో తారాస్థాయికి పోయిన రియల్ వ్యాపారం ఒక్కసారిగా భూమికి దిగడంతో అతలాకుతలమై పోయారు.

సిమెంటు రోడ్లు

ముత్తుకూరు మండలంలోని పలు ప్రాంతాలకు ఎట్టకేలకు మోక్షం కల్గింది. నిన్న మొన్నటివరకు మట్టిరోడ్లు, దెబ్బతిని వున్న రోడ్లు నేడు మాతనశోభను సంతరించుకొంటున్నాయి. పెద్దఎత్తున మండలంలో సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టడమే దీనికి కారణం. ఎంతో కాలంగా సరైన రోడ్లు లేక, వున్న మట్టి రోడ్లు పరమభయంకరంగా తయారై డొంకదారుల్లో ప్రయాణిస్తున్న ప్రజలకు ఇక నుంచి మంచి రోజులు వచ్చినట్లే లెక్క ఎసిడిపి నిధులతో మూమారు తొంభై లక్షల రూపాయలు వెచ్చించి ఈ రోడ్లను నిర్మిస్తున్నారు. ఈ నిధులతో మొత్తం 24 ప్రాంతాలలో సిమెంట్ రోడ్ల నిర్మాణం జరుగుతుంది. దీనితోపాటు ఎంపి, ఎమ్మెల్యే, జడ్పీ జనరల్ ఫండ్స్ ద్వారా మరో 36 లక్షల రూపాయలతో 14 రోడ్లను నిర్మించేందుకు అధికారులు సిద్ధం చేశారు. అనలే అంతంత మాత్రంగా వున్న మట్టిరోడ్లు వర్షం వస్తే

తొరవ 14వ పేజీలో

గూడూరు కొళాయిల్లో మురికినీరు!

పట్టించుకొనేవారే లేరు!

గూడూరు పట్టణంలో పారిశుద్ధ్యం అధ్వాన్నం అన్న సంగతి తెలిసిందే. దీనికితోడు మునిసిపాలిటీ సరఫరా చేస్తున్న మంచినీటి కొళాయిల్లో కలుషిత నీరు వస్తుండడంతో ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎక్కడచూసినా చెత్తాచెదారం పేరుకపోయి అంటురోగాల బారిన పడిన జనానికి కలుషిత నీటి వలన కొత్త రోగాలతో ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి రావడంతో అల్లాడిపోతున్నారు. రంగు మారి వాసన వస్తున్న నీటిలో పురుగులు వస్తుండడం వల్ల ఆ నీటిని త్రాగాలంటేనే జనం భయపడుతున్నారు. మునిసిపాలిటీ సరఫరా చేసే మంచినీటి పైపుల లీకేజీ, సక్రమంగా వాటర్ ట్యాంకులను శుభ్రపరచకపోవడం వలన కలుషిత నీరు వస్తున్నదని, పట్టణంలోని ప్రజలు రోగాల బారిన పడుతున్నా మునిసిపల్ పాలకులుగానీ, అధికారులు గాని స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు. పట్టణంలో వున్న బోర్లు, బావులలో ఉప్పునీరు వస్తుండడంతో తప్పని సరి పరిస్థితులలో మునిసిపాలిటీ సరఫరా చేసే నీటిపై ఆధారపడాల్సి వస్తున్నదని అదే తమ పాలిట శాపమైందని వారు ఆవేదన చెందుతున్నారు. పట్టణ ప్రజలు పడుతున్న అవస్థలు పాలకులకు, అధికార్లకు కన్పించకపోవడం విచారకరం.

ఆరుబయట సర్వీసు రిజిష్టర్లు!

భద్రంగా వీరువాల్లో వుండాల్సిన ఉపాధ్యాయుల సర్వీసు రిజిష్టర్‌లు చేజర్ల మండలంలో మాత్రం ఆరుబయట కన్పిస్తుండడం పట్ల మండలంలోని టీచర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల విద్యాశాఖాధికారి వుండే ఎంఆర్‌సి భవనంలో ఎవరు వచ్చినా ముందు అయ్యోర్ల సర్వీసు రిజిష్టర్‌లు దర్శనమిస్తుంటాయి. ముప్పైఏళ్లపాటు తమ వృత్తికి సంబంధించిన వివరాలు నమోదు చేస్తూ, భద్రంగా వీరువాల్లో వుంచాల్సి వుండగా ఎంఇఓ నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ఎక్కడ ఎస్‌ఆర్‌లు కన్పడకుండా పోతాయోనని హడలిపోతున్నారు టీచర్లు. ఇప్పటికే పొదలకూరు మండలంలో పలువురు ఉపాధ్యాయుల సర్వీసు రిజిష్టర్‌లు కన్పించడం లేదన్న సమాచారంతో అక్కడి టీచర్లు బెంబేలు పడుతున్నారు. ఈ పరిస్థితులలో చేజర్ల లోనూ ఇలాంటి పరిస్థితి ఏదురౌతుందేమోనన్న అనుమానం, భయం టీచర్లను వెంటాడుతోంది. వాటిని భద్రంగా పదిల పరచాల్సిన ఎంఇఓ నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల అయ్యోర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఎందుకైనా మంచిదని ఎస్‌ఆర్‌లను తీసుకెళ్లి దూప్లికేట్ కాపీలు సిద్ధం చేసుకొంటున్నారు.

వీడలేకున్నా నిలువు దోపిడీ!



నెల్లూరు రైల్వేస్టేషన్ వద్ద రోడ్డే స్కూటర్ పార్కింగ్ స్టాండ్.

నెల్లూరు నగరంలోని రెండు ప్రధాన పార్కింగ్ స్థలాల్లో వాహనదారులను నిలువుదోపిడీ చేస్తున్నారు. రుసుము కట్టి పార్కింగ్ చేసుకొన్న వాహనాలకు తగిన వసతి కల్పించాల్సిన కాంట్రాక్టర్లు అదొక వృధా ఖర్చుగా భావిస్తున్నారు. ఫలితంగా పార్కింగ్ చేసుకొన్న వాహనాలు ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ పాడవుతున్నాయి. నగరంలోని ఆర్టీసి బస్టాండ్లు, రైల్వేస్టేషన్ల లోని పార్కింగ్ ప్రదేశాలలో ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండానే ఎనిమిది గంటలకు ఓ మారు నాలుగు రూపాయల లెక్కన పార్కింగ్ ఫీజు వడ్డిస్తున్నారు. ఆర్టీసి మెయిన్ బస్‌స్టేషన్‌లోని సైకిల్, స్కూటర్ స్టాండుకు రేకుల షెడ్ కూడా లేదు. ఆత్మకూరు బస్టాండ్‌లోని స్టాండు పరిస్థితీ అంతే. రైల్వేస్టేషన్‌లో కొన్ని వాహనాలకు మాత్రమే సరిపడా రేకుల షెడ్ వుంది. మిగతా వాహనాలు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ వుంటాయి. ఎనిమిది గంటలు ప్రమాణికంగా పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నందున వాహనాలకు ఎటువంటి నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత స్టాండ్ల నిర్వాహకులపై వుంది. కానీ వారు

ఆర్టీసి బస్టాండ్, రైల్వే స్టేషన్లలో పార్కింగ స్థలాల కాంట్రాక్టర్లకు పట్టపగ్గాలు లేవు.

రంలోని ఆర్టీసి బస్టాండ్లు, రైల్వేస్టేషన్ల


కొరవ 14వ పేజీలో



కార్పొరేషన్ రిటైర్డ్ వుద్యోగుల ఆకలికేకలు!

ఇంకా అందని గ్రాట్యుటీ, గ్రూప్‌ఇన్సూరెన్స్, ఇతర మొత్తాలు.

నెల్లూరు కార్పొరేషన్‌లో పనిచేసి రిటైర్ అయిన పలువురు వుద్యోగులకు రావాల్సిన రాయితీలు గత కొన్నేళ్లుగా చేతికి రాకపోవడంతో ఆ కుటుంబీకులకు పూట గడవడం కష్టంగా పరిణమించింది. వుద్యోగ విరమణ చేసిన 550 మందికి పైగా వుద్యోగులకు ప్రభుత్వం ఇచ్చే గ్రాట్యూటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, గ్రూప్ ఇన్సూరెన్స్ తాలుకు మొత్తాలు, ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం పద్దులో మొత్తాలు, జనరల్ ప్రావిడెంట్ ఫండ్ తదితర ప్రయోజనాలన్నీ కలిపి ఏడు కోట్ల రూపాయల వరకు చెల్లించాలి. ఈ ప్రయోజనాలన్నీ రావాల్సిన వుద్యోగుల్లో కొందరు చనిపోయారు. ఇంత జరిగినా గతంలో మునిసిపల్ ఛైర్మన్‌గా పనిచేసి రెండుసార్లు ఎమ్మెల్యే అయిన వివేకానందరెడ్డి ఒక్కరోజు కూడా తనకున్న పలుకుబడితో ఈ సమస్య పరిష్కారానికి దారులు వెతకలేదు. మేయర్ పులిమి శైలజను మాత్రం రాచిరంపాన పెట్టను తన శక్తియుక్తులన్నీ వినియోగిస్తున్నారు. వుద్యోగ విరమణ తర్వాత ప్రశాంత జీవనం గడపాలని ఆశించిన వుద్యోగులు నిత్యావసరాలు, వియ్యం ధరలు విపరీతంగా పెరిగిపోయిన ఈ తరుణంలో రోజూ తమకు రావాల్సిన మొత్తాలపై కాళ్లు అరిగేలా కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా తమ గోడు పట్టించుకోకపోవడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించను ప్రయత్నం మొదలుపెట్టారు.



రిపబ్లిక్‌డే పెరేడ్‌లో పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న కలెక్టర్ రాంగోపాల్.

ఆలస్యంగా ఎగిరిన జాతీయ జెండా!

నెల్లూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో 60వ గణతంత్ర దినోత్సవపు వేడుకలు ఈసారి బాగానే జరిగినా జాతీయ జెండాను మాత్రం ఆరు నిమిషాలు ఆలస్యంగా ఎగురవేయడం చర్చనీయాంశమయ్యింది. జనవరి 26వ తేది జాతీయ జెండాను పేరేడ్ గ్రౌండ్‌లో జిల్లా కలెక్టర్ ఎగురవేస్తారు. కచ్చితంగా ఉదయం తొమ్మిది గంటలకు ఈ కార్యక్రమం జరిగిపోతుంది. ఈ వేడుక చూడను సమాచార మంత్రి రామనారాయణరెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి, డిప్యూటీమేయర్ మాదాల వెంకటేశ్వర్లు, ఎస్పీ మల్లారెడ్డి తదితరులంతా విచ్చేశారు. కానీ జెండా ఎగురవేయాల్సిన కలెక్టర్ రాంగోపాల్ ఆరు నిమిషాలు ఆలస్యంగా పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌కు విచ్చేసి హడావుడిగా జెండాను ఆవిష్కరించారు. జెండాను ఈవిధంగా ఆలస్యంగా ఎగురవేసిన సాదృశ్యం ఈ 20 ఏళ్లలో ఎప్పుడూలేదు. పోలీసు గౌరవ వందనం స్వీకారం అనంతరం జిల్లా అభివృద్ధిపై ముందుగానే తయారుచేసిన నివేదికను 9.20 నిమిషాలకు చదవడం మొదలుపెట్టి 9.45 నిమిషాలకు పూర్తి చేశారు. ఈ కార్యక్రమం పూర్తయ్యాక కలెక్టర్ ప్రముఖులను కలవడం అలవాటు; ఈసారి కలెక్టర్ సామాన్యుల దగ్గరకు సైతం వెళ్లి కరచాలనం చేశారు.

రిపబ్లిక్‌డే పెరేడ్‌లో ఎప్పుడూ ఇలా జరగలేదు.

ఎన్నికల సంవత్సరం కావడంతో గ్రౌండ్‌లో ఏర్పాట్లు ఘనంగానే చేశారు. జంబో షామియానాల చుట్టూ మువ్వన్నెల పతాకాన్ని పోలిన తోరణాలతో పాటు అరటి పిలకలు, మామిడి ఆకులు కట్టారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, గ్రామీణ నీటి సరఫరా, ఎస్సీ కార్పొరేషన్, ఐటిడిఏ, గృహనిర్మాణ సంస్థ,

కొరవ 14వ పేజీలో

తీండిల్ వుచ్చులో విలవిల!

నెల్లూరు నగరంలోని పేద, మధ్యతరగతి ప్రజలు తండల్ వ్యాపారస్తుల ఉచ్చులోపడి విలవిలలాడిపోతున్నారు. తీసుకొనే అప్పుకు వడ్డీని ముందుగానే తండల్ వ్యాపారులు వసూలు చేస్తారు. ఈ మొత్తాన్ని మూడు నెలల్లో చెల్లించకుంటే ఇక తండల్ వ్యాపారులు విశ్వరూపం ప్రదర్శిస్తారు. తండల్ వ్యాపారులు చిన్న



బజారు, పెద్దబజారుల్లోని చిన్నాచితకా వ్యాపారం చేసుకొనే వ్యక్తులకు కొంత మొత్తం అప్పుగా ఇస్తారు. దీనికిగాను నూటికి ఇరవై రూపాయలు వడ్డీ వసూలు చేస్తారు. ట్రైకోర్డు చేపల మార్కెట్‌లో 100 రూపాయలకు 25 రూపాయలు దినసరి వడ్డీని వసూలు చేస్తారు. కార్పొరేషన్‌లోని నాల్గవ తరగతి వుద్యోగులు నెలసరి జీతాలు అందుకొన్న వెంటనే తండల్ వ్యాపారులు సొంతం చేసుకొంటుంటారు.

కొరవ 14వ పేజీలో

బ్లాక్‌లో అరుంధతి టిక్కెట్లు!



పెద్దహీరోల సినిమాలు, ప్రముఖ నటులు వున్న సినిమాలు విడుదలైనప్పుడు టిక్కెట్లు బ్లాక్‌లో అధిక ధరలకు విక్రయించడం సహజంగా చూస్తుంటాం. కానీ అరుంధతి సినిమాకు మాత్రం విచ్చలవిడిగా బ్లాక్ టిక్కెట్ల అమ్మకాలు జరుగుతున్నాయి. మామూలు సినిమా టిక్కెట్ ధరకన్నా రెండు మూడింతలు ఎక్కువగా, 80 రూపాయల నుంచి 150 రూపాయల వరకు ఈ సినిమా టిక్కెట్లు బ్లాక్‌లో విక్రయిస్తుండడంతో దీనిపై వున్న మోజుతో అంత ధర పెట్టి టిక్కెట్లు కొంటున్నారు. మరోవైపు విచ్చలవిడిగా బహిరంగంగా బ్లాక్ అమ్మకాలు జరగడం ప్రేక్షకులకు ఆగ్రహాన్ని, ఆవేదనను కల్గిస్తున్నది. సినిమా థియేటర్‌లలో పనిచేసే పలువురు వ్యక్తులు బ్లాక్ టిక్కెట్లు అమ్మేవారితో కుమ్మక్కై కొద్ది టిక్కెట్లు మాత్రమే కౌంటర్ల వద్ద క్యూలో వేచి చూసేవారికి ఇచ్చి, అధిక భాగం బ్లాక్‌లో అమ్మేస్తున్నారు. పెద్ద కథానాయకుడు లేని అరుంధతి సినిమాకు బ్లాక్‌లో అంతంత ధర పలుకుతుంటే ఇక మిగతా హీరోల సినిమాలు, ప్రముఖ బ్యానర్‌ల సినిమాలకు ఇంకెంత ధరకు

రెండవవారం కూడా తగ్గని గాలి

బ్లాక్‌లో విక్రయిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. పోలీసులు అప్పుడప్పుడు బ్లాక్ టిక్కెట్ల విక్రేతలను పట్టుకొన్నామని చెబుతున్నప్పటికీ, బహిరంగంగా సినిమా హాళ్ల వద్ద, హాల్ సిబ్బందితో కలసి అమ్ముతున్న వారిపై మాత్రం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మనసు దోచిన పీద్య నాటకం!



స్వాతంత్ర్య మహాసంగ్రామం 1857లో ఓ ఉద్విగ్నభరిత సన్నివేశం.

స్వాతంత్ర్య మహాసంగ్రామం 1857కు అవార్డుల పంట

నెల్లూరు కస్తూరిబా కళాక్షేత్రంలో వారం రోజులపాటు నిర్వహించిన నంది నాటకోత్సవాల్లో చివరిరోజు 24వ తేది ప్రదర్శించిన ఏకైక నాటకం ప్రథమ స్వాతంత్ర్య మహాసంగ్రామం-1857 పద్యనాటకానికి ఆ విభాగంలో అవార్డులు పెద్ద సంఖ్యలో లభించాయి. ఈ నాటకాన్ని విజయవాడలోని సాయిబాబా నాట్యమండలి ప్రదర్శించింది. వ్యాపారం చేసుకొంటామని భారతదేశంలో అడుగుపెట్టిన తెల్లదొరలు దేశాన్ని ఏ విధంగా కబళించారు... వారిని మన స్వాతంత్ర్య సమరయోధులు ఏవిధంగా ఎదుర్కొన్నారన్నది ఈ పద్యనాటక ఇతివృత్తం. ఈ నాటకానికి బంగారు నంది తోపాటు 50వేల రూపాయల నగదు పురస్కారం లభించింది. ఈ నాటక రచయిత, దర్శకుడు టిఎస్ కృష్ణకు రెండు విభాగాల్లో వ్యక్తిగత అవార్డు వచ్చింది. ఈ నాటకంలో ఝాన్సీలక్ష్మీబాయి పాత్రలో అదరగొట్టిన సురభి జమునా రాయల్ ఉత్తమ సహాయ నటిగా తామ్ర నంది, పదివేల రూపాయల నగదు, ప్రశంసాపత్రం అందుకొంది. ఈ నాటకానికి సంగీతం కూర్చిన బి.యజ్ఞనారాయణ, లైటింగ్ సమకూర్చిన పి.భాస్కర్ శర్మకు అవార్డులొచ్చాయి.

పద్యనాటకాల్లో ద్వితీయ అవార్డు సినీ రచయిత ఆకెళ్ల వ్రాసిన అల్లసాని పెద్దనకు వచ్చింది. ఈ నాటకాన్ని దియంగ్ మెన్స్ హ్యాపీక్లబ్-కాకినాడ వారు

తొరవ 14వ పేజీలో



నంది నాటక అవార్డుల ప్రదానోత్సవ సభలో మాట్లాడుతున్న సమాచార మంత్రి రామనారాయణరెడ్డి.

వచ్చే ఏడాది నుంచి బాలల నాటక పోటీలు!

నంది నాటకోత్సవాల అవార్డుల ప్రదానోత్సవం 24వ తేది సాయంత్రం విఆర్ హైస్కూలు గ్రౌండ్‌లో అట్టహాసంగా జరిగింది. ఈమధ్య సినిమా వంద రోజుల ఫంక్షన్లకు వేస్తున్న కొత్త తరహా వేదికపై బహమతులిచ్చారు. కార్యక్రమం ఆలస్యంగా మొదలు కావడంతో అసలు అవార్డులిచ్చే సమయానికి కళాకారులు మినహా జనం లేకపోవడం వెలితిగా తోచింది. ఈ అవార్డుల ప్రదానోత్సవానికి నెల్లూరు ఎమ్మెల్యే వివేకానందరెడ్డి అధ్యక్షత వహించగా కావలి, అల్లూరు, ఉదయగిరి శాసన సభ్యులే హాజరయ్యారు. మిగతా ఎమ్మెల్యేలు, కేంద్ర మంత్రి పనబాక లక్ష్మి, రాష్ట్ర మహిళా మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మమ్మ ఈ కార్యక్రమానికి డుమ్మా కొట్టారు. అవార్డుల ప్రదానోత్సవానికి రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి బొత్సా సత్యనారాయణ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. సంస్కృతి, సాంప్రదాయాలను చాటే కళలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి అండదండలు అందిస్తుందన్నారు.

నంది నాటక అవార్డుల ప్రదానోత్సవ సభలో రామనారాయణరెడ్డి వెల్లడి!

సమాచార మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ నెల్లూరులో నంది నాటకోత్సవాలు అద్భుతంగా జరిగాయి. నాటకోత్సవాల్లో పద్య, సాంఘిక నాటకాలు, సాంఘిక నాటికల విభాగాలున్నాయి. భావితరం నాటకాలను మరచిపోకుండా వచ్చే ఏడాది నుంచి నాలుగో విభాగంగా బాలల నాటకాల విభాగంలోనూ పోటీ నిర్వహిస్తామని ప్రకటించారు. నెల్లూరులో మినీ రవీంద్ర భారతి నిర్మాణానికి ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారని రామనారాయణరెడ్డి చెప్పారు. సురభి సమాజాలు శ్రీవెంకటేశ్వర, భానోదయ, విజయభారతి, శ్రీ శారద నాటక సమాజాలకు లక్ష రూపాయల చొప్పున ప్రోత్సాహక పారితోషికాలిచ్చారు. సమాచార శాఖ కమీషనర్ పార్థసారధి, జిల్లా పరిషత్ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కలెక్టర్ రాంగోపాల్, ఎస్పీ మల్లారెడ్డి, కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మన్ వాకాటి నారాయణరెడ్డి తదితరులు వేదికపై ఆసీ

తొరవ 14వ పేజీలో



జిల్లాలో ఏడులక్షల తెల్లరేషన్ కార్డులు

రేషన్ అందని కార్డుదారులు లక్ష్మన్నరపైనే...

జిల్లాలో తెల్లరేషన్ కార్డుల సంఖ్య ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయింది. రేషన్ కార్డుల విషయమై రాష్ట్ర ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయంతో గతంలో జారీచేసిన 47,738 గులాబీ రంగు కార్డులను తెలుపు రంగు కార్డులుగా మార్చారు. దీంతో జిల్లాలో తెల్లరేషన్ కార్డుల సంఖ్య ఏడు లక్షలా 30వేలకు చేరుకొంది. గులాబీరంగు కార్డులతో కలుపుకొంటే జిల్లాలో ఎనిమిది లక్షల 50 వేలకుపైగా కుటుంబాలు వీధి ఒకకార్డును కలిగి వున్నాయి. ఇవి కాకుండా అంత్యోదయ అన్నయోజన, అన్నపూర్ణ కార్డులతో కలుపుకొని ప్రభుత్వం నెలకు 10,408.38 మెట్రిక్ టన్నుల బియ్యం రేషన్‌కార్డుదారులకు సరఫరా చేస్తుంది. గత ఆరు నెలల లోపు జారీచేసిన ఏ రేషన్ కార్డుకు డీలర్లు సరకులివ్వడం లేదు. దీంతో కార్డుదారులు వారితో ఘర్షణకు దిగుతున్నారు. జిల్లాలో రేషన్ కార్డులు జారీ చేసే ప్రక్రియ ఇంకా కొనసాగుతున్నందున కొత్త కార్డులకు సరకులు కేటాయించలేక పోతున్నట్లు జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి జ్వాలా ప్రకాష్ చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి కొనసాగుతుందన్నారు. కొత్తగా జారీ చేసిన రేషన్ కార్డులన్నీ చూపుడుకే అనక తప్పదు.



ఏదేశమేగినా ఎంతెత్తు కెదిగినా
జన్మభూమిని, 'జమీన్‌రైతు'ను
మరవక పోవడం
నెల్లూరీయుల సాంప్రదాయం

పాఠకులకు ప్రత్యేక కానుక

ఎనభైఏళ్లుగా 'జమీన్‌రైతు'ను తమ అభిమాన పత్రికగా
అదరిస్తున్న పాఠకులకు ఈ కొత్త సంవత్సరంలో ప్రత్యేక కానుకగా
"సెల్లో" హాట్ పాట్ అందిస్తున్నాము.
1-12-2008 నుండి 31-3-2009 మధ్య కాలంలో
చందా చెల్లించిన వారందరికీ ఈ కానుక అందుతుంది!

సంవత్సర చందా రూ.200/- జీవిత చందా రూ.1000/-

చందా చెల్లించిన వెంటనే రశీదుతో పాటు కానుక అడిగి తీసుకోండి. ఇతర ప్రాంతాల నుంచి ఎం.ఓ. లేదా డి.డి. (చెక్కులు స్వీకరించబడవు) ద్వారా చందా పంపేవారు స్కీమ్ కాలపరిమితి ముగిసేలోగా మా కార్యాలయానికి వచ్చి కానుక స్వీకరించాలి. కానుకను పోస్టులో పంపడం సాధ్యం కాదు.

జమీన్‌రైతు

వెంకటరమణ హోటల్ మిద్దెపైన, పొగతోట, నెల్లూరు - 524 001. ఫోన్: 0861-2327354

సాహసోపేత వార్తా చిత్రిక - జమీన్‌రైతు వారపత్రిక

వారఫలాలు

తేది 31-1-2009 నుంచి 6-2-2009 వరకు మకరంలో రవి, కుజ, గురు, రాహువులు; ధనస్సులో బుధుడు; మీనంలో శుక్రుడు; సింహంలో శని; కర్కాటకంలో కేతువు; కుంభ, మీన, మేష, వృషభ, మిథునాల్లో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగం

31వ తేది వసంతోత్సవ ఆరంభం.
2వ తేది రథసప్తమి.
5వ తేది భీష్మ ఏకాదశి.
5వ తేది మీనలగ్నంలో 8.30.గం.ల నుండి 9.30.గం.ల వరకు శుభముహూర్తాలున్నాయి.

జనవరి, ఫిబ్రవరి తిథులు
మాఘ శుద్ధ

31	శని	పంచమి	రా.6.44 గం.ల.వ
1	ఆది	షష్ఠి	రా.6.10 గం.ల.వ
2	సోమ	సప్తమి	సా.5.22 గం.ల.వ
3	మంగళ	అష్టమి	మ.3.53 గం.ల.వ
4	బుధ	నవమి	మ.1.54 గం.ల.వ
5	గురు	దశమి	ఉ.11.28 గం.ల.వ
6	శుక్ర	ఏకాదశి	ఉ.8.41 గం.ల.వ
		ద్వాదశి	తె.5.39 గం.ల.వ

పి.ఎం.గోపాలాచారి,
16/1020, పొగతోట, నెల్లూరు - 1.
E-mail:maripmgg@yahoo.com



మేషం
(అశ్వని, భరణి, కృత్తిక 1 పాదం)

అలసటకు అవకాశాలెక్కువ. అయినా ధైర్యంతో అన్ని పనులు నిర్వహిస్తారు. కళత్ర సంబంధం చక్కగా వుంటుంది. సంతానానికి అవసరమైనవి అమరుస్తారు. గురువులు, పెద్దలను దర్శించి ఆశీస్సులందుకొంటారు. సోదరుల సాయం అందుతుంది. సంఘంలో పలుకుబడి గలవారి మైత్రి ఏర్పడుతుంది. వస్త్రాభరణాలు కొంటారు. రాజకీయులు నూతనోత్సాహం కనబరుస్తారు.



వృషభం
(కృత్తిక 2,3,4 పా., రోహిణి, మృగశీర్ష 1,2 పా.)

కుటుంబ సభ్యులతో సదవగాహనకు వూనుకోవాలి. పిల్లలకు నిదానంగా హితబోధ చేయండి. తల్లి ఆరోగ్యం జాగ్రత్త. వృధాఖర్చులు మనసుకు కష్టాన్నిస్తాయి. అయినా ధనాదాయంలో లోపం వుండదు. పెద్దల మాట పాటించడం మంచిది. రాజకీయులు ఎవరినీ విమర్శించకుండడం మంచిది. పుణ్యక్షేత్రాటన కలదు. వ్యాపారులకు మంచి లాభావకాశాలు. వ్యాపార రహస్యాలు ఎవరికీ చెప్పవద్దు.



మిథునం
(మృగశీర 3,4 పా., ఆర్ద్ర పునర్వసు 1,2,3 పా.)

కళత్ర సంబంధం చక్కగా వుంటుంది. నూతన గృహోపకరణాలు కొంటారు. రోగ విముక్తి ఏర్పడుతుంది. గొప్పవారి సాయమందుతుంది. మాతృసుఖం చక్కగా వుంటుంది. సాంఘిక కార్యకలాపాల్లో పాలుపంచుకొంటారు. మంచి తెలివితేటలు ప్రదర్శిస్తారు. సోదరులతోడ్పాటు చక్కగా వుంటుంది. రాజకీయులు జాగ్రత్తగా నడుచుకోవాలి. వ్యాపారంలో మీకు సాటిరారు. ఉద్యోగులకు శుభోదయం.



కర్కాటకం
(పునర్వసు 4 పాదం, పుష్యమి, ఆశ్లేషలు)

నూతన మిత్రులు కలసివస్తారు. కుటుంబసభ్యులతో కాలక్షేపం చేస్తారు. రాదనుకున్న డబ్బు చేతికందుతుంది. కోపావేశాలకు లోనవుతారు. సంతానం అనుకూలంగా వుంటుంది. సోదరులు సాయమందిస్తారు. ప్రభుత్వ కార్యకలాపాలు ఉత్సాహంగా నెరవేర్చుతారు. స్థిరాస్తుల విషయంలో జాగ్రత్త అవసరం. భాగస్వామ్యం బాగా వుంటుంది. రాజకీయులకు, వృత్తిపరులకు ప్రోత్సాహం.



సింహం
(మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం)

పిల్లలు చదువులో శ్రద్ధ చూపించాలి. కుటుంబంలో సుఖసంతోషాలు తాండవిస్తాయి. ఆర్థికలావాదేవీల్లో మంచి మార్పులు వస్తాయి. ఆడపిల్లలకు ముందు చూపు అవసరం. సోదరులతో వివాదాలు రాకుండా చూసుకోండి. నూతన మిత్రులను కలిసే అవకాశం. కడుపునొప్పి, అలసట చోటు చేసుకొంటాయి. వ్యాపారులు తొందరపాటు నిర్ణయాలు తీసుకోరాదు. రాజకీయులు ఎవరినీ విమర్శించకుండడం మంచిది.



కన్య
(ఉత్తర 2,3,4 పా., హస్త, చిత్త 1,2 పా.)

ఆటంకాలు తొలగి అన్ని పనులు చక్కగా జరుగుతాయి. ఎదురుచూసిన డబ్బు చేతికందుతుంది. బంధుమిత్రులతో హాయిగా కాలక్షేపం చేస్తారు. కుటుంబసభ్యుల తోడ్పాటు బాగా వుంటుంది. సంతానమూలంగా కొంత మనశ్శాంతి తగ్గవచ్చు. ప్రభుత్వ సంబంధిత పనులు చక్కగా సాగుతాయి. బయట ప్రయాణాలు లాభకరంగా ముగుస్తాయి. వ్యాపార విస్తరణకు తగిన పథకాలు ఏర్పరుస్తారు. ఉద్యోగులు పైవారికి సలహాలిస్తారు.



తుల
(చిత్త 3,4 పా. స్వాతి, విశాఖ 1,2,3 పా.)

చాలా రోజులుగా వివిధ అడ్డంకులతో ఆగిపోయిన పనులు ఒక్కొక్కటిగా చక్కబడుతాయి. దూరప్రయాణాలు ఆనందకరాలు, లాభకరాలు. కుటుంబంలో మీ మాట చెల్లుబడిఅవుతుంది. గౌరవ మర్యాదలు పెరుగుతాయి. ఎదురుచూసిన మార్గాల్లో ధనప్రాప్తి. నిద్రలేమి వుండవచ్చు. కొంత ఉత్సాహంతో సోదరులు సాయమందిస్తారు. అస్తి వ్యవహారాల్లో స్పష్టత వుంటుంది. రాజకీయులకు అనుకూల వాతావరణం. కళాకారులకు మంచి రోజులు.



వృశ్చికం
(విశాఖ 4వపాదం, అనూరాధ, జ్యేష్ఠ)

సోదరులు మనఃపూర్వకంగా తోడ్పాటునందిస్తారు. మంచి మాటకారితనంతో అన్ని పనులు చక్కబెట్టుకొంటారు. రాదని వదులుకొన్న డబ్బు చేతికందుతుంది. మానసిక అశాంతికి దూరమౌతారు. నూతన ప్రయత్నాలు ప్రయోజనవంతమౌతాయి. వ్యాపారులకు పోటీలు అధికంగా వుంటాయి. రాజకీయాల్లో నూతనోత్సాహం కానవస్తుంది. ఉద్యోగుల పని సామర్థం బహిర్గతమవుతుంది. బాధ్యతలు పెరుగుతాయి.



ధనుస్సు
(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వపాదం)

సోదరులతో సదవగాహన పెంచుకోవాలి. ఇచ్చిపుచ్చుకోవడాలలో తేడాలు రావచ్చు. భార్యాభర్తల సంబంధం కొంత నిరాశాజనకంగా వుంటుంది. పిల్లలు కుటుంబ పరిస్థితుల్ని అర్థం చేసుకొని నడుచుకోవాలి. ఒత్తిడి, వినుగు తగ్గుముఖం పడుతుంది. రాజకీయులు నిదానంగా ఆలోచించి నడుచుకోకుంటే ఇబ్బందులు పడాల్సి వస్తుంది. తొందరపాటు నిర్ణయాలు వ్యాపారులను నష్టానికి గురిచేస్తాయి. విద్యార్థులకు మేలుకాలం కాదు.




మకరం
(ఉత్తరాషాఢ, 2,3,4 పా., శ్రవణం, ధనిష్ఠ 1,2 పా.)

కుటుంబ సభ్యుల ఆదరం వుంటుంది. నూతన వస్త్రాభరణాలు కొంటారు. సంతాన మూలక సుఖసంతోషాలు లభిస్తాయి. పరస్పర సహకారం చక్కగా వుంటుంది. ఆరోగ్య విషయంలో కొంత జాగ్రత్త అవసరం. పుణ్యక్షేత్ర దర్శనం చేసుకొంటారు. ఇరుగు పొరుగు వారితో మంచిగా మెలగాలి. కోపావేశాలు తగ్గించుకొని ప్రవర్తించండి. రాజకీయులు సంబంధం లేని వాటిలో తల దూర్చవద్దు. వ్యాపారులకు పాత బాకీలు వసూలవుతాయి.



కుంభం
(ధనిష్ఠ 3,4 పా., శతభిష, పూర్వాభాద్ర 1,2,3 పా.)

భార్యాభర్తల సంబంధం దెబ్బతినవచ్చు. దాంపత్యసుఖంలోటుకు అవకాశాలున్నాయి. ఎవరితోనూ వాదాలు పెంచుకోవద్దు. కీళ్లనొప్పులు విషమిస్తాయి. కోపావేశాలు తగ్గించుకొని ఓర్పు పెంచుకోవాలి. ఆడపిల్లలు ఆలోచించి అడుగువేయాలి. వాహనాలు జాగ్రత్తగా నడపాలి. ప్రమాదావకాశాలున్నాయి. వ్యాపారులు వివిధ మార్గాల్లో నూతన నిర్ణయాలు తీసుకొంటారు. ఉద్యోగులకు పనిభారం సూచితం.



మీనం
(పూర్వాభాద్ర 4 పాదం, ఉత్తరాభాద్ర, రేవతి)

ఈవారంలో ఎదురుచూడని ఖర్చులు అధికం. ఇతరుల సాయం చక్కగా వుంటుంది. ప్రభుత్వ సంబంధిత పనులు సాఫీగా ముగుస్తాయి. సమాజంలో గౌరవ ప్రతిష్టలు పెరుగుతాయి. సోదరుల సాయం అందుతుంది. నిద్రలేమి అలసటను పెంచుతుంది. విద్యార్థులు ఉత్సాహంగా చదువు సాగిస్తారు. ఆగిన పనులు కొద్దిగా ముందుకు సాగుతాయి. వ్యాపారులకు మంచి లాభావకాశాలు. వృత్తిపరులకు అధిక పనిభారం.

యంత్రమే తారక మంత్రం!

టి.వి.కె.జాహ్నవి నెల్లూరు

* ప్రవర్తనలో మార్పు, అనారోగ్యం, దుర్వ్యసనాలు ఇవన్నీ మావారికున్న గుణాలు. ఈయన బాగుపడాలంటే వాస్తులో ఏదైనా మార్గం వుందా?

అతని ఆరోగ్యానికీ, ఆయుష్షుకు పుట్టిన తేది, సమయం వంపితే 'యంత్రం' సూచిస్తాను. యంత్రమే దీనికి తారకమంత్రం.

పి.వి.సురేంద్రాచారి విజయవాడ

* వాస్తు మాకు బాగా తెలుసు. దేవాలయానికి సలహాలిచ్చాను.

గృహాలకు వాస్తు, ఆలయాలకు 'ఆగమం' ఆగమ పండితుల్ని సంప్రదించండి. తెలియని విషయాల్లో 'జోక్యం' అంత మంచిది కాదు.

జి.వి.సురేంద్రనాథ్ ఉదయగిరి

* పశ్చిమ జలదోషాల నివారణకు ఉపాయం ఏమిటి?

జలదోష నివారణ అసాధ్యమైనపుడు 'కూర్మయంత్రం' ప్రతిష్ట మంచి ఫలితాలనిస్తుంది.

టి.వి.కె.సుభద్రాదేవి తడ

* ఆయన అకస్మాత్తుగా 'పెరాలసిస్'కు లోనయ్యారు. అంతకు క్రితం అనారోగ్యం కూడా లేదు. ప్లాను వంపిస్తున్నాను.

వాయువ్యం అగాధమైనపుడు పశ్చిమ దోషయుక్తమై యజమాని ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తుంది. వెంటనే అక్కడి సెప్టిక్ ట్యాంకును తీసివేయండి.

పరిమి దేశయ్య నూళ్లూరుపేట

* ఆర్థిక, ఆరోగ్య సమస్యలెక్కువయ్యాయి. ఏదైనా 'రాళ్లు' సూచిస్తారా?

ప్లాను పరిశీలించాక మీరు 'శక్తి యంత్రం' ప్రతిష్ట చేయడం వల్ల సమస్యలు పరిష్కారమౌతాయనిపిస్తున్నది. మీ జన్మరాశిని బట్టి మీకు పగడం(శ్రేష్ఠ), ముత్యం (విలోమ) సరిపోతాయి.

వాస్తు సందేహాలు-సమాధానాలు
ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి
ఫోన్ : 2322345
సెల్: 94901 25878
4వ వీధి, గాయత్రినగర్
ఎ.కె.నగర్ పోస్టు, నెల్లూరు - 4.

వి.ఆర్.లక్ష్మీప్రసన్న అనంతపురం

* టెన్త్ వరకూ చాలా మంచి మార్కులు వచ్చాయి. ఇంటర్ నుంచి చదువు నత్తనడక నడుస్తోంది.

ఇటీవల కట్టిన తూర్పు ప్రహరీని రెండడుగులు తగ్గించండి. ఈశాన్యంలోని సిమెంట్ తొట్టిని దక్షిణం వైపుకు మార్చండి. ఇంటికి వినాయక(త్రివిధ) యంత్రం. అతడికి కెంపు(ప్రశస్త) మేలు చేస్తాయి.

పెర్నేటి జగదాంబ చెన్నై

* పశ్చిమ గృహం! ఆయన ఆరోగ్యం విషమమవుతున్నది.

పశ్చిమ నైరుతి 'మూత'ను వెంటనే తీసివేయండి. రాహుదోషానికి గోమేధుకం (ప్రశస్త) ధరింపజేయండి. శివక్షేత్ర క్షీరాభిషేకం వల్ల తప్పనిసరి ఫలితం వుంటుంది.

టి.వి.అవినాష్ హైదరాబాద్

* చాలా ప్రశస్తమైన కంపెనీ ఉత్పత్తులతో షాపు ఏర్పాటుచేస్తే బిజినెస్, చాలా స్తబ్ధంగా వుంది.

బీరువా, క్యాష్‌బాక్స్ ఆగ్నేయంలో తీసివేసి నైరుతిలో ఉత్తరం, లేదా తూర్పు చూపించండి. ప్రవేశ ద్వారాన్ని వాయువ్యంలో ఏర్పాటు చేయండి. లక్ష్మీకృత వాస్తు యంత్రం వల్ల మంచి ఫలితాలుంటాయి.

వి.ఎస్.వసుమతిరెడ్డి సికింద్రాబాద్

* ఊర్లు, వ్యాపారాలు మారుస్తూ బేహారులైపోతున్నాం తప్ప, ఈ కుటుంబం బాగుపడేట్లు లేదు.

మీకు ఇల్లు, అంగడి, తూర్పు, దక్షిణ దిశలవి కలసి వస్తాయి. జన్మ నక్షత్రరీత్యా వస్త్రవ్యాపారం మంచిది. యంత్రం 'లక్ష్మీ (శ్రేయో) రత్నం పగడం (శ్రేష్ఠ) ఫలితాలనిస్తాయి.

సి.కె.విజయకుమార్‌రెడ్డి చిత్తూరు

* మానసికంగా చాలా మెత్తన. మైల్డ్‌బోయ్. అవజయాలు కూడా అలాగే జరుగుతున్నాయి.

వాస్తుయంత్ర ప్రతిష్ట ఇంట్లో, లక్ష్మీయంత్రం కార్యాలయంలో చేయండి. కెంపు, ముత్యం(ప్రశస్త) రెండు కారెట్లు మంచి ఫలితాలనిస్తాయి.

ఎం.కె.యు.మహేశ్వరి నాయుడుపేట

* 'విధి' బలీయం అంటారు. ఎలా సాధ్యం?

'సంహితల్లో' 'ప్రాప్తం' విధి సాధ్యాసాధ్యాలను గురించిన ప్రస్తావనలున్నాయి. విజ్ఞులు సూచించిన అద్భుత క్రియల్ని నిర్లక్ష్యం చేయడం, చేయవలసిన విధివిధానాలు కారణాంతరాల వల్ల తప్పిపోవడం, జరగవలసిన 'కర్మలు' జరిగిపోవడాన్ని 'విధి' బలీయంగా చెబుతారు.

కవిత

"మట్టి చిత్రాలు"

వాన కోసము
రైతు చూపు పైపైకి
మబ్బు చిత్రాలు -

వర్షపుధార
రైతులో ఆనందము
అప్పు కావాలి -

పాల పొట్టలు
పచ్చని ఆయకట్టు
రైతుల కల -

కల్లాలు చట్రం
పిడేటుల సందడి
ధాన్యరాశులు -

అప్పుల చిట్టా
పండిన పంట జమ
కాలేకడుపు -

పొయిలో పిల్లి
రైతుబంధాల వస్తు
జై జై కిసాన్?-

- జయంపు కృష్ణ, హైదరాబాద్.


20వ డివిజన్‌లో బోలెడు సమస్యలు!

నగరంలోని 20వ డివిజన్ ప్రజలు పలు సమస్యలతో సతమతమవుతున్నారు. ముఖ్యంగా ఈ డివిజన్‌లో డ్రైనేజీ సమస్య, పారిశుద్ధ్య సమస్యలు ప్రజలను వణికి పీడిస్తున్నాయి. వర్షాకాలంలో వర్షపు నీటితో పాటు మురికి నీరు కూడా రోడ్లపై ప్రవహిస్తుంటుంది. ఫత్తేఖాన్‌పేట కూడలిలో ద్విచక్రవాహనాలు వెళ్లే పరిస్థితి కూడా వుండదు. మురికినీరు, వర్షపునీరు రోడ్లపైకి చేరి ప్రక్కనే వున్న నివాసాల్లోకి చేరిపోతుంది. ఇందుకు ప్రధాన కారణం డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడమే. శాంతినగర్, బట్వాడిపాళెంలలో కొంతమేర డ్రైనేజి మెరుగ్గానే వున్నా టెక్మిట్ట ఎర్రకట్ట దళితవాడలో అధ్వాన్నంగా వుంది.

ఈ డివిజన్ నుంచి గతంలో కార్పొరేటర్‌గా పోలుబోయిన సుధాకర్ ఎన్నికైనాడు. అనారోగ్యకారణంగా సుధాకర్ మృతిచెందడంతో తర్వాత జరిగిన ఉపఎన్నికలో ఆయన అన్న కుమారుడు పోలుబోయిన అనిల్‌కుమార్ కార్పొరేటర్ డివిజన్ అయినప్పటికి అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో స్థానిక ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

20వ డివిజన్ పరిధిలో బట్వాడి పాళెం, శాంతినగర్, టెక్మిట్ట, ఎర్రకట్ట దళితవాడ, మాగుంట లేఅవుట్‌లో కొంత భాగం వున్నాయి. ఎర్రకట్ట దళితవాడలో చాలా మంది పేద ప్రజలు నివశిస్తున్నారు. వీరందరికి ఇళ్లస్థలాలు లేకపోవడం వలన ఒకే ఇంట్లో సర్దుబాటు చేసుకొని జీవనం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో వేసిన సిమెంటురోడ్లు శైతం శిథిలావస్థకు చేరుకొన్నాయి. ఈ రోడ్లను తిరిగి నిర్మించేందుకు ఎటువంటి ప్రయత్నాలు చేయడం లేదు. రోడ్లపై వేసిన చెత్తా చెదారాన్ని తొలగించే పారిశుద్ధ్య సిబ్బంది రెండు, మూడు రోజుల కోసారి దర్శనమిస్తుంటారు.

సురక్షిత మంచినీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని, ఒక నిర్దిష్ట సమయంలో నీటి సరఫరా చేయకుండా ఇష్టానుసారంగా చేయడం వలన అందరికి అందకుండా పోతుండంటున్నారు స్థానికులు. అలాగే కొన్ని వీధులలో వీధిలైట్లు వెలగక రాత్రి సమయంలో ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. ఈ నేపథ్యంలో డివిజన్ సమస్యలపై స్థానికులు వెల్లడించిన అభిప్రాయాలను దిగువనిస్తున్నాం.



చూపుడుకే ఈ బోరు.



డివిజన్‌లో పేరుకపోయిన చెత్త.

రోడ్లు నిర్మించాలి!

20వ డివిజన్ పరిధిలోని ఎర్రకట్ట దళితవాడలో నివశించే వారికి ఇళ్ల స్థలాలు లేక ఇబ్బందిపడుతున్నాం. రెవిన్యూ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకొన్నా పట్టించుకొన్నవారు లేరు.



ఇందిరమ్మ ఆదర్శ డివిజన్లలో ఇళ్లు లేనివారికి ఇళ్లస్థలాలు ఇస్తామని నగరంలో అనేక దఫాలు నాయకులు చేసిన ప్రకటనలు అమలు కావడం లేదు.

కొండమ్మ, స్థానికురాలు.

డ్రైనేజ కాల్వలు నిర్మించాలి!

మా డివిజన్‌లో డ్రైనేజ కాల్వలు సరిగా లేకపోవడం వలన ఇళ్ల మధ్యలో మురికి నిల్వ వుంటుంది. ఇలా ఇళ్ల మధ్యన మురికి దానిలో పందులు స్వైరవిహారం చేస్తుండడంవల్ల అంటు



వ్యాధులు వ్యాపించే ప్రమాదం వుంది. ఇప్పటికైనా మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు, సంబంధిత కార్పొరేటర్ స్పందించి డ్రైనేజి కాల్వల నిర్మాణం కోసం చర్యలు తీసుకోవాలి.


భాదర్‌ఖాన్, స్థానికుడు.

నామమాత్రంగా ఉద్యానవన శాఖ!

"ఉద్యానవన పంటల ప్రోత్సాహానికి గత రెండేళ్లలో ప్రభుత్వం 16కోట్ల రూపాయలు మంజూరు చేసినా దీని వల్ల ప్రయోజనం పొందిన రైతులు లేరు."

జిల్లాలో సాంప్రదాయంగా పండించే పంటకు ప్రత్యామ్నాయంగా సరికొత్త పంటలను వేసేలా చేసి రైతులకు లబ్ధి చేకూర్చాలన్న లక్ష్యంతో ఏర్పాటుచేసిన ఉద్యానవనశాఖ ఆశించిన లక్ష్యాలను సాధించలేకపోతుంది. ఈ శాఖలో పనిచేసే అధికారులు, సిబ్బంది అవినీతి, అక్రమాల కారణంగా ఆశించిన ఫలితాలు అందకుండా పోతున్నాయి. ఉద్యానవన శాఖకు ప్రతి సంవత్సరం కోట్ల రూపాయల నిధులు విడుదలవుతున్నా ఇవి లబ్ధిదారులకు మాత్రం దక్కకుండా పోతున్నాయి. ప్రభుత్వం మాత్రం ఉద్యానవన శాఖ ద్వారా పండ్లతోటలు, పూలతోటల పెంపకం ద్వారా రైతులు ఆర్థికంగా స్థిరపడుతున్నారని ప్రకటిస్తుంటుంది. వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తే మాత్రం ఇందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి.

పథకాల మంజూరులో చూపే ఉత్సాహం అమలు చేసే విషయంలో మాత్రం అధికారులు చూపలేక పోతున్నారు. ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులను వేలాది హెక్టార్లలో పండ్ల తోటలు, పూలతోటలు పెంపకానికి ఖర్చు చేసినట్లు అధికారులు కాకి లెక్కలు చెబుతున్నారు. అయితే అధికారులు రికార్డులలో పేర్కొన్న గ్రామాలను సందర్శిస్తే వీరు చేస్తే మాటలు నమ్మకంగా కనిపించవు. ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో అరటి, మామిడి, బత్తాయి, వానపాముల పెంపకం, పూలతోటలు తదితర పథకాలు అమలు చేయడం జరుగుతుంది. ఈ పథకాల మంజూరులో షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలకు చెందిన లబ్ధిదారులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం మార్గదర్శక సూత్రాలను జారీ చేసి వుంది.



ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు భూమిపై హక్కుకు సంబంధించిన పట్టాదారు పాస్‌బుక్‌ను అధికారులకు అందజేసి కోరిన పథకాన్ని మంజూరు చేయించుకోవచ్చు. అయితే గ్రామీణ ప్రాంతాలలోని ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ఉద్యానవనశాఖ అమలుచేసే పథకాల గురించి సమాచారం అందించే దిక్కు లేకుండా పోయింది. ప్రభుత్వం తోటల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు 50 శాతం రాయితీ ఇస్తుంది. ఒక్కో రైతు 10 ఎకరాలకు మించకుండా సహాయం పొందవచ్చు. మామిడితోటల పెంపకానికి ఒక్కో హెక్టారుకు మొదటి సంవత్సరం 8,670 రూపాయలు, రెండవ సంవత్సరం 3,674 రూపాయలు, మూడవ సంవత్సరం 5,645 రూపాయల వంతున సబ్సిడీ ఇవ్వడం జరుగుతుంది.

ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో అమలుచేసే పథకాల పర్యవేక్షణ చేసేందుకు, రైతులకు సూచనలు, సలహాలు ఎప్పటికప్పుడు అందించేందుకు జిల్లాలో 8మంది విస్తరణాధికారులు పని చేస్తున్నారు. ఒక్కో విస్తరణాధికారి 5 మండలాల్లో బాధ్యతలు నిర్వహించాల్సి వుంటుంది. వీరు సక్రమంగా పని చేయకుండా స్వంత పనులలో నిత్యం బిజీగా వుంటున్నారు. ఒక హెక్టారుకు అయ్యే ఖర్చులో రైతుల నుంచి ముందుగానే వాటా కట్టించుకొంటున్నారు. రైతులు అరటి, మామిడి, పూలతోటల పెంపకం ప్రారంభించి నెలలు గడుస్తున్నా కూడా ప్రభుత్వం వైపు నుంచి అందాల్సిన సబ్సిడీ నిధులు అందడం లేదు. ఈ నిధులు అందాలంటే సంబంధిత సొసైటీల నుంచే రసాయనిక ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేయాలన్న నిబంధన విధిస్తున్నారు అధికారులు.

అధికారుల ఆదేశాల ప్రకారం సొసైటీల నుంచే ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసినా కూడా సబ్సిడీ నిధులు మంజూరు చేయడం లేదని రైతులు వాపోతున్నారు. మండల స్థాయిలో పనిచేసే విస్తరణాధికారులు రైతుల నుంచి బాగానే లంచాలు గుంజుతున్నారు. సబ్సిడీ నిధులు మంజూరు కావాలంటే కొంత ఖర్చులుంటాయని, వీటిని రైతులు భరించక తప్పదని కొందరు అధికారులు జంకు బొంకు లేకుండా చెబుతున్నారు. 2006-07 సంవత్సరంలో కోటి 66లక్షలు, 2007-08 సంవత్సరంలో 6కోట్ల 18లక్షలు, 2008-09 సంవత్సరంలో 8కోట్ల 20లక్షల రూపాయలు ఉద్యానవనశాఖకు ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధుల కారణంగా ఎంతమంది రైతులు ఆర్థికంగా ప్రయోజనం పొందారన్న వివరాలు

తరువ 14వ పేజీలో

బిపాసకు ఖరీదైన కానుక



జాన్ అబ్రహం, బిపాసబసులు ప్రేమికులన్న విషయం అందరికీ తెలిసిందే. వీరిద్దరి మధ్య ఆరేళ్ల ఎడం వున్నా పబ్‌లు, హోటళ్లలో వీకెండ్ పార్టీల్లో కనపడుతూనే వుంటారు. ఇటీవల ఓ చిత్రం షూటింగ్‌కు న్యూయార్క్‌కు వెళ్లిన వీరిద్దరూ షాపింగ్‌కు వెళ్లారట. బిపాసను ఒక హ్యాండ్ బ్యాగ్ బాగా ఆకర్షించింది. వెంటనే సొంతం చేసుకోవాలని దాని ఖరీదు అడిగిందట. 15లక్షలని షాపువారు చెప్పారట. ధరకు నిర్ఘాంతపోయి వెనుకడుగు వేసిన బిపాసను మెప్పించేందుకు జాన్ అబ్రహం ముందుకొచ్చాడు. 15 లక్షలు చెల్లించి ఆమె కోరుకున్న బ్యాగ్ ఆమె చేతికి కిచ్చాడట. తనపట్ల జాన్‌కు వున్న ప్రేమను చూసి బిపాస ముచ్చట పడిపోయిందట. ఖరీదైన బహుమతి అక్కునచేర్చుకొని మురిపెముసి నవ్వులు నవ్విందట. ప్రియునికి ఇంతకన్నా ఏం కావాలి.

ముద్దులివ్వనంటున్న తమన్నా!



తెలుగు, తమిళచిత్రాల్లో నటిస్తున్న హాపీడేస్ ఫేం తమన్నా గ్లామర్ రోల్స్ చేసినా ఎక్స్‌పోజింగ్, బికినీలు, స్విమ్‌సూట్స్ ధరించనంటుంది. సినిమాలకు అదనపు క్రేజ్ తెచ్చిపెట్టే లిప్‌కిస్‌లు వుండే సన్నివేశాలు అసలు చేయనని తేల్చి చెప్పేసింది. ఈ కోవలోనే బాలీవుడ్ హిట్ మూవీ జబ్‌వుయ్‌మెట్‌కు తమిళ రీమేక్‌లో ఇటువంటివి చేయననే సరికి నిర్మాత, దర్శకులు తలలు పట్టుకొని కూర్చొన్నారట. ఏ గ్లామర్ లేనప్పుడు సినిమాకు హీరోయిన్ అదనపు ఆకర్షణ ఎలా అవుతుందనేదే నిర్మాతల ప్రశ్న.

బికినీకి కమలిని నై

హీరోయిన్ల సంఖ్య పెరుగుతుండడంతో వారి మధ్య కెరీర్ పరంగా పోటీ కూడా పెరుగుతూంది. నటన విషయంలో పోటీ కాకపోయినా, దేహప్రదర్శన విషయంలో హీరోయిన్ల మధ్య పోటీ తీవ్రమయ్యింది. అభినయతారలుగా పేరొందిన వారు



సైతం గ్లామర్ వైపు మొగ్గుచూపుతున్నారు. ఎక్స్‌పోజింగ్‌కు సై అంటున్నారు. ఆనంద్, గోదావరి, స్టైల్ చిత్రాలలో హోమ్లీగా నటించిన కమలిని ముఖర్జీకి వేషాలు తగ్గిపోతుండడంతో బికినీల్లో కనిపించను కూడా అభ్యంతరం లేదని ప్రకటించింది. ఈమె ప్రకటనకు ఎందరు నిర్మాతలు స్పందిస్తారో వేచిచూడాలి.

షహీద్‌కు ప్రియాంక ముద్దులు



విశాల్ భరద్వాజ్ తీస్తున్న కొత్త చిత్రం కమీనేతో బాలీవుడ్ భామ ప్రియాంక చోప్రా బాగా బిజీ అయిపోతుందని చెబుతున్నారు. కారణం ఈ చిత్రంలో ఆమె రెండు, మూడు ముద్దు సీన్లలో నటించడమే. ఈ చిత్రంలో హీరో షహీద్ కపూర్‌కు ముద్దులివ్వడంతోపాటు, మరి కొన్ని హాటసీన్లలో ఆమె నటించింది. దీనికి గాను పెద్ద మొత్తం విశాల్ ఆమెకు సమర్పించాడట. గతంలో లవ్‌స్టోరీ 2050, ఫ్యాషన్ చిత్రాలలో ముద్దుసీన్లు, హాటసీన్లకు ప్రియాంక నో అంది. కమీనేలో మాత్రం ఒప్పుకొంది. ఈ సినిమా ఎప్పుడు విడుదలవుతుందా అని ఆమె అభిమానులు భూతద్దాలు వేసుకొని మరీ ఎదురుచూస్తున్నారు.

అవార్డు వూహించలేదు...



మంత్ర చిత్రంతో ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకొన్న బొద్దుగుమ్మ ఛార్మి. 2007 సంవత్సరానికి గాను ఉత్తమనటిగా నంది అవార్డు అందుకోనున్నది. అవార్డు రావడం, ఆ విషయాన్ని తనను ఎంతగానో అభిమానించే దర్శకుడు కృష్ణవంశీ ఫోన్ చేసి చెప్పడంతో ఉప్పొంగిపోయింది. ఈ విషయమై మాట్లాడుతూ అనుకోకుండా ఒకరోజు, రాఖీ చిత్రాలకు అవార్డు వస్తుందని ఆశించాను. అయితే రాలేదు. మంత్రపై నాకు నమ్మకమే లేదు. ఆ సినిమా విడుదలే కష్టమనుకొన్న తరుణంలో ప్రేక్షకులు ముందుకు వచ్చి విజయం సాధించడం, నాకు కొత్త ఇమేజ్‌తోపాటు అవార్డు తెచ్చిపెట్టడం ఆనందంగా వుందంది.

అదరగొట్టే అరుంధతి!



సెల్లూరీయుడు, నిర్మాత మల్లెమాల శ్యాంప్రసాద్ రెడ్డికి గ్రాఫిక్స్ వినియోగించి సినిమాలు తీయడమంటే మహాఇష్టం. గతంలో అమ్మోరు, అంజి చిత్రాలను ఇదే తరహాలో రూపొందించారాయన. ముచ్చటగా మూడో చిత్రంగా రెండున్నర సంవత్సరాలపాటు కష్టపడి 12కోట్ల రూపాయలకు పైగా వెచ్చించి ఆయన తీసిన అరుంధతి చిత్రం ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకొంటుంది. బాక్సాఫీసు రికార్డులను బద్దలు చేస్తున్నది. మంత్రాలు, తంత్రాలు, ఆత్మలు, ప్రేతాత్మలపైనే చిత్రకథ ఆధారపడినా చక్కని స్క్రీన్‌ప్లే, కెమెరా, కళా దర్శకత్వం, విజువల్ ఎఫెక్ట్స్, బ్యాక్‌గ్రౌండ్ సంగీతం, మాటలు బాగా కుదరడంతో 14రీళ్ల ఈ చిత్రం అప్పుడే అయిపోయిందా అనే భావనకు ప్రేక్షకులు లోనవుతారు. కథానుగుణంగా విజువల్ ఎఫెక్ట్స్ నిపుణుడు రాహుల్ నంబియార్ సృష్టించిన గద్వాల్ సంస్థానం దేదీప్యమానంగా వెలగడం, ఆ తర్వాత ప్రేతాత్మల నిలయం కావడం, చివరన అక్కడి భీభత్సదృశ్యాలు చిత్రం చూస్తున్న వారిని రోమాంచితులను చేస్తాయి. ప్రేతాత్మగా నటించిన సోనూసూద్ సమాధి బద్దలు చేసుకొని బయటకు రావడం, అరుంధతి అతడ్ని చంపే దృశ్యాలతోపాటు ప్రేతాత్మ తల్లిగా సుభాషిణి, అరుంధతి ఆత్మాహుతి, నృత్యం, కత్తులు పొడుచుకొని రావడం, రైలుపట్టాలపై కారు, అఘోరాలతో కూడుకొన్న సన్నివేశాలు ఇంగ్లీషు సినిమాలు చూడని మామూలు తెలుగు ప్రేక్షకులను మైమరిపింపజేస్తాయి.

చిత్రంలో ప్రేతాత్మను చాలా దూరం ఎదుర్కొనే ఫకీర్ పాత్రధారి చేత బిస్మిల్లా యిర్రహమా నిర్రహీం డైలాగుతోపాటు భగవద్గీతలోని జాతస్య హిధ్రువో మృత్యు ర్ధ్రువం... డైలాగులు దర్శకుడు అస్పష్టంగా పలికించిన తీరు క్షమించరాని తప్పు. ఇంకోచోట ఫకీర్ నువ్వు జేజమ్మవు... మళ్లీ పుట్టావు అని ఇస్లాంలో లేని మరు జన్మ గూర్చి మాట్లాడడం మాటలు వ్రాసిన చింతపల్లి రమణ అవగాహనా రాహిత్యాన్ని ఎత్తిచూపుతుంది. ఆయన వ్రాసిన వేదాల్లో దేవుడు వేరు, మనుషులకు ఆకలి ఒకటే మాట ఆలోచింప చేస్తుంది. ప్రేతాత్మ మాట్లాడే... బొమ్మాళీ.... నిన్ను వదల డైలాగును చిత్రంలో పలుమార్లు పలురకాలుగా పలికిన డబ్బింగ్ ఆర్టిస్ట్ రవిశంకర్‌ను

అల్లూరు రహీం

అభినందించకుండా వుండలేం. సినిమాలో పలుమార్లు వినిపించే జేజమ్మ... మాయమ్మ గీతంలోని చరణంలో నీ త్యాగానికి మృత్యువుకే కళ్లు చెమ్మగిల్లాయమ్మా అనే పదవిన్యాసాన్ని చేసిన కవి అభినందనీయుడు. వేదనా... వేదనా పాటను ప్రేక్షకులు చంద్రముఖిలో చివరి పాటను ఊహించుకొంటారు. ఈ పాటలో గ్రాఫిక్స్ చంద్రముఖి పాటను డామినేట్ చేశాయి. కెమెరామెన్ సెంథిల్ కుమార్, విజువల్ ఎఫెక్ట్స్ కూర్చిన రాహుల్ నంబియార్ ప్రతిభకు దర్శకుడు కోడిరామకృష్ణ మెరుగులు దిద్దుతూ అరుంధతిని తెలుగు తెరపై ప్రకాశింపజేశాడని చెప్పక తప్పదు.

చిత్రకథలోనికి వెళ్తే గద్వాల్ సంస్థానపు రాణి అరుంధతిని (అనుష్క) అక్కడి ప్రజలు తమ ప్రాంతపు కుల దేవత జేజమ్మగా అభివర్ణిస్తుంటారు. ఆమె బావ పశుపతి (సోనూసూద్) వ్యసనలోలుడు. భార్య ముందే వేశ్యలతో కులుకుతుంటాడు. అరుంధతికి నృత్యం నేర్పించను వచ్చిన అంధ నర్తకిని పశుపతి పాశవికంగా చంపడం కళ్లారా చూసిన ఆమె రగిలిపోతుంది. భవిష్యత్తులో సంస్థానంలో ఎవరూ మహిళలను వేధించకుండేలా దారుణ శిక్ష పశుపతికి విధిస్తుంది. కొనఊపిరితో వున్న పశపతిని అఘోరాలు రక్షించి ప్రాణాలు కాపాడుతారు. వారి వద్ద తాంత్రికవిద్యలు నేర్చి, మనుషుల రక్తం తాగే పశుపతి అఘోరా రాక్షదోపానకుడిగా మారుతాడు. అతను తిరిగి గద్వాల్ సంస్థానానికి వచ్చేసరికి అరుంధతికి పెళ్లి జరగను అన్ని ఏర్పాట్లు పూర్తయివుంటాయి. అక్కడ తన శక్తులతో నానాభీభత్సం సృష్టించే పశుపతిని ఒక పథకం ప్రకారం అరుంధతి జీవసమాధి చేస్తుంది. దానికి రక్షగా దుర్గా, గాయత్రి యంత్రాలు, త్రిశూలాలు వుంచుతుంది. జీవసమాధిలో పసుపతి చనిపోయి ప్రేతాత్మగా మారుతాడు. అతడి సమాధిలో నుంచి వచ్చే గాలికి గద్వాల్ సంస్థానం సర్వనాశనమవుతుంది. ఈ సమయంలో అరుంధతి ఈ ఉపద్రవ నివారణకు అన్ని క్షేత్రాలు తిరుగుతుంది. సాధువులు, స్వాములను కలుస్తుంది. అంతిమంగా అఘోరాలు అరుంధతి ఆత్మ బలిదానంతో తయారయ్యే అద్భుత ఆయుధంతోనే పశుపతి ప్రేతాత్మను అంతం చేయవచ్చని సలహాయిస్తారు. దీంతో ఆమె ఆ పని చేస్తుంది.

80ఏళ్ల తర్వాత గద్వాల్ సంస్థానంలో మూడోతరంలో మళ్లీ అరుంధతి (అనుష్క) పుడుతుంది. ఆమెకు రాహుల్ (దీపక్)తో పెళ్లి నిశ్చయమవుతుంది. తాతయ్యను (సత్యనారాయణ) చూడను హైదరాబాద్ నుంచి గద్వాల్ వచ్చిన అరుంధతిని, పశుపతి ప్రేతాత్మ వుక్కిరి బిక్కిరి చేస్తుంది. అష్టకష్టాలు పడి చంద్రమ్మ (మనోరమ), ఫకీర్ అన్వర్ (సాయాజి షిండే) సహకారంతో పశుపతిని చంపే ఆయుధం సంపాదించి అతడ్ని అంతమొందించడంతో సినిమా ముగుస్తుంది.

గ్లామర్ నటి అనుష్క అరుంధతి పాత్రను మెప్పించిందనాలి. దీనికిగాను ఆమె బాగా కష్టపడింది. పశుపతి పాత్రలో హిందీ నటుడు సోనూసూద్ అదరగొట్టేశాడు. ఇతని తల్లి పాత్రలో క్రూరంగా కనపడి సుభాషిణి ప్రేక్షకుల అభిమానం పొందింది.

నాటక రంగానికి జీవితం అంకితం చేసిన అల్లాబక్ష్!

"కర్నూలుజిల్లా ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామానికి చెందిన బొద్దపల్లి అల్లాబక్ష్ ముల్లా చిన్ననాటి నుంచే నటనపై ఆసక్తి పెంచుకున్నాడు. రంగస్థలంపై ఆంజనేయుడిగా, హరిశ్చంద్రునిగా, శ్రీరామునిగా, శ్రీకృష్ణునిగా ఏ వేషం వేసినా, ఏ పద్యం ఆలపించినా, ఆ పాత్రలో లీనమై వారే కనపడతారు. అటువంటి అల్లాబక్ష్‌కు ఈయేటి ఎన్టీఆర్ స్మారక నాటక రంగ పురస్కారం ఇవ్వడం కళాకారులందరినీ ఆనందపరిచింది."

భక్తాగ్రేసరుడు ఆంజనేయుడిగా, అసత్యమాడని హరిశ్చంద్రునిగా, ఏక పత్నీవ్రతుడు, తండ్రి మాటని జవదాటని శ్రీరాముడిగా, పదహారువేల మంది గోపికలతో, ఆలమందలతో వుండే యదుకుల తిలకుడు శ్రీకృష్ణునిగా ఏ వేషం వేసినా, ఏ పద్యం ఆలపించినా ఆ పాత్రల్లో లీనమై వారే కళ్లకు ఎదురుగా వున్నారా అన్నట్లు నటించడం, కాదు... ఆయా పాత్రల్లో జీవించడంలో అల్లాబక్ష్ ప్రతిభ అనన్య సామాన్యం. నటనకు సత్తా వుండాలే గాని కులమతాల పట్టింపులు, భాషా పరమైన ఇబ్బందులు వుండవని నిరూపిస్తున్నారు నంది నాటకోత్సవంలో 2008 సంవత్సరానికి ప్రతిష్టాత్మకమైన ఎన్‌టిఆర్ పురస్కారానికి ఎంపికైన బొద్దపల్లి అల్లాబక్ష్ ముల్లా.

కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామానికి చెందిన ఆయన చిన్ననాటి నుంచే నటనపై ఆసక్తి పెంపొందించుకొన్నాడు. చుట్టు ప్రక్కల ప్రాంతాలలో ఎక్కడ ఏ సమాజం వారు నాటకం వేసినా వెళ్లి చూస్తూ అప్పటి నుంచే తాను నాటకాలలో వేషం వెయ్యాలని, మంచి నటుడిగా పేరు ప్రతిష్టలు తెచ్చుకోవాలని కలలు కన్న అల్లాబక్ష్ తను అనుకొన్న లక్ష్యాన్ని పలువురి సహకారంతో చేరుకొన్నాడు. ఉపాధ్యాయ వృత్తి చేపట్టిన ఆయన 1953లో వేముల గ్రామంలో పని చేస్తున్న నాటి నుంచి పూర్తిస్థాయిలో నాటక రంగప్రవేశం చేశాడు. తాను నటించడమే కాకుండా ఔత్సాహికులకు నాటకాలలో ముఖ్యంగా పద్యనాటకాలలో తగిన శిక్షణ కూడా ఇచ్చాడు. ఆనాటి నుంచి వయస్సు మీదపడి స్వచ్ఛందంగా రంగస్థలం నుంచి తప్పుకొనేంత వరకు వివిధ పాత్రలు, పలు వేషాలు వేసి ఎన్నో అవార్డులు, పురస్కారాలు పొందిన 76ఏళ్ల అల్లాబక్ష్ నటసార్వభౌమ ఎన్‌టిఆర్ పురస్కారం అందుకొన్నారు. లక్షరూపాయల నగదు, బంగారు నందిని నంది నాటకోత్సవాల ముగింపురోజు ఆయనకు అందజేశారు. ప్రతిష్టాత్మకమైన అవార్డు తీసుకొన్న సందర్భంగా ఆయన మనోగతాన్ని 'జమీన్‌రైతు'కు వివరించారు.

ఏ కళాకారుడికైనా నటన కంటే ముందు భాషపై పట్టువుండాలి. ఉచ్చారణ స్పష్టంగా వుండాలి. అచ్చులు, హల్లులను పలికేటప్పుడు స్పష్టత అవ



ఎన్టీఆర్ అవార్డును అల్లాబక్ష్‌కు అందజేస్తున్న రాష్ట్రమంత్రులు రామనారాయణరెడ్డి, బొత్స సత్యనారాయణ.


తరువ 14వ పేజీలో

మెదడును సక్రమంగా వినియోగిస్తేనే

జ్ఞాపకశక్తి, తెలివితేటలు పెరుగుతాయి!

విద్యార్థులకు డాక్టర్ గమనం సలహా.

మార్కులు, ర్యాంకులు, ఎంసెట్‌లో సీట్లు సంపాదించడం ఇది నేటి విద్యార్థుల ముందున్న లక్ష్యాలు. పొద్దున లేచింది మొదలు నిద్రించే వరకు పుస్తకాలతో కుస్తీపడుతూ, మరో ధ్యాసే లేకుండా సృజనాత్మకత అసలే లేకుండా పోతున్న తరుణంలో విద్యార్థులకు మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు, జ్ఞాపకశక్తిని పెంపొందించుకొనే అంశంపై ప్రఖ్యాత న్యూరోలింగ్విస్టిక్ ప్రోగ్రామింగ్ (ఎన్ఎల్‌పి) నిపుణుడు డాక్టర్ గమనం విద్యార్థులకు సలహాలిచ్చారు. నెల్లూరు నగరంలోని వేదవ్యాస స్కూలు, లిల్లీ లిటిల్ ఫ్లవర్ స్కూలు తదితర పాఠశాలల్లో ఈ కార్యక్రమం జరిగింది. గమనం మాట్లాడుతూ ప్రపంచంలో తెలివిగల పిల్లలు, తెలివితక్కువ పిల్లలు అని రెండు రకాలుగా వుండరు. అందరి మెదడు ఒకేలా వుంటుంది. అయితే మెదడును సక్రమంగా వినియోగిస్తున్నామా లేదా అనే దానిపైనే జ్ఞాపకశక్తి, తెలివితేటలు ఆధారపడి వుంటాయి. మెదడులో కుడి, ఎడమ వైపు రెండు అర్ధభాగాలుంటాయి. చదవడం, వ్రాయడానికి, లెక్కలు తదితరాలకు సంబంధించి ఎడమవైపు భాగం పని చేస్తుంది. పలువురు చిన్నారులు పాఠశాలలకు వెళ్లేంత వరకు వారి మెదడు పూర్తిగా పని చేస్తుంది. స్కూలుకు వెళ్లడం ప్రారంభించిన తర్వాత కేవలం ఎడమవైపు



విద్యార్థులకు చిట్కాలు చెప్తున్న డాక్టర్ గమనం.

తరువ 14వ పేజీలో

ధరలు పెంచారు... బరువు తగ్గించారు!

ప్రతి ఒక్కరికి అవసరమైన సబ్బులు, టూత్‌పేస్ట్‌లు, షాంపు, పౌడర్ల ధరలను పెంచిన ఉత్పత్తిదారులు వస్తువుల బరువు తగ్గించి వినియోగదారులను దోచుకొంటున్నారు.

నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడం, మరోవైపు కూరగాయల ధరలు అంతే స్థాయిలో పెరిగి ప్రజల జీవితాలపై పెనుభారం పడుతున్న పరిస్థితులలో ఫ్యాన్సీ వస్తువుల ధరలు చుక్కలనంటడంతో వినియోగదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ ధరాఘాతంతో పేద, మధ్యతరగతి ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. నిత్యావసర వస్తువులు, కూరల ధరల పెరుగుదలను అటుంచితే వివిధ కంపెనీలు ఫ్యాన్సీ వస్తువుల ధరలను మాత్రం రెండు రెట్లు పెంచడంతోపాటు, వినియోగదారులను తెలివిగా మోసం చేస్తుండడంతో ప్రజలు అదనపు భారం మోయడంతోపాటు ఆయా కంపెనీల దగాకి గురౌతుండడం విస్మయం కల్గిస్తున్నది. గడిచిన ఎనిమిది నెలల కాలంలోనే వంద శాతానికి పైగా ధరలు పెంచిన కంపెనీలు కూడా వున్నాయంటే ఎంతగా వినియోగదారుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయో స్పష్టం అవుతుంది. కొన్ని ప్రముఖ కంపెనీలు తెలియని రీతిలో మోసం చేస్తున్నాయి. ఒక వైపు ధరను పెంచడంతోపాటు, ఎవరికి తెలియని విధంగా ఆయా వస్తువుల బరువును తగ్గించి వేయడం ఆ కంపెనీల మోసానికి పరాకాష్ట. ప్రజలందరు ఎక్కువగా వినియోగించే గుడ్డల సబ్బులు, శరీరానికి ఉపయోగించే సబ్బులు, టూత్ పేస్టు, పౌడర్‌లాంటి వస్తువుల పరిస్థితిని, వాటి ధరలు, తూకాన్ని పరిశీలించినట్లయితే ఈ దగా తేటతెల్లం అవుతుంది. గత ఏప్రెల్‌లో 125 గ్రాములున్న బట్టలు ఉతికే రిన్‌సబ్బు 8.50 రూపాయల ధర ఉండగా, డిసెంబర్ నెలనాటికి అదే సబ్బు ధర రెండింతలు పెరిగింది. దీనిధర 15 రూపాయలకు చేరుకోగా బరువు మాత్రం 125 గ్రాముల నుంచి 5 గ్రాములు తగ్గి 120 గ్రాములకు రావడాన్ని పరిశీలించినట్లయితే ఆయా కంపెనీలు ఎంతగా వినియోగదారులను మోసం చేస్తున్నది బట్టబయలవుతుంది. చాలామంది వినియోగదారులు వస్తువుల ధరలు పెరిగాయని ఆవేదన చెందడం మినహా వస్తువుల తూకం తగ్గించారని తెలియక మోసపోతున్నారు. ఇదే బాటను పలు కంపెనీలు అనుసరిస్తూ వినియోగదారులను నిలువు దోపిడి చేస్తున్నాయి. ఒక్క నెలలోనే రెండుసార్లు ధరలు పెంచిన కంపెనీలు వున్నాయంటే ఎంతగా అవి ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నాయో అర్థమవుతున్నది. టూత్ పేస్ట్‌లకు సంబంధించి పెప్సోడెంట్ పేస్టు 100 గ్రాములు ఆగస్టు 11వ తేదీన 23 రూపాయలు వుండగా అదే నెల 28 తేదీకల్లా 25 రూపాయలు, పదిరోజుల తేడాతో మరో 2 రూపాయలు పెంచారని తెలుసుకొని వినియోగదారులు ఆశ్చర్యపోతున్నారు. లక్స్‌సోప్ ఏప్రెల్‌లో 100 గ్రాములు 12.50 వుండగా, డిసెంబర్ నాటికి 90 గ్రాములు చేసి ధర మాత్రం 18 రూపాయలు చేశారు. హమామ్, సంతూర్ సబ్బుల పరిస్థితి ఇంతే. క్లినిక్ ప్లస్ షాంపు 100 గ్రాములు 32 రూపాయలు వుండగా దానిని ఏకంగా 44కు పెంచారు. అత్యధికంగా హిందూస్థాన్ కంపెనీ వస్తువుల ధరలు పెరిగినట్లు సమాచారం.







చంద్రబాబు

మొదటి పేజీ కొరవ

రాజును అరెస్టు చేసినపుడు, చంద్రబాబును మాత్రం ఎందుకు చెరసాలకు పంపకూడదన్నది ముఖ్యమంత్రి వాదన. సత్యం వలెనే దీనిపై కూడా సిబిసిఐడి దర్యాప్తుకు ఆదేశించి, డైరెక్టర్లను అరెస్ట్ చేయాలన్నది ఆయన పట్టుదల.

అయితే, సత్యంపై సిబిసిఐడి దర్యాప్తుకు ఆదేశించడంలో ముఖ్యమంత్రి దురుద్దేశపూరితంగా వ్యవహరించాడని, కేంద్ర సంస్థలకు రామలింగరాజు దొరకకుండా సిబిసిఐడి ద్వారా జైలుకు పంపి రక్షించాడని ఆయన్ను నిందిస్తున్నారు కేంద్ర నాయకులు. ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ కూడా దీనిపై ఆగ్రహం వ్యక్తం చేశాడని వార్తలొచ్చాయి. సెబి వంటి సంస్థలు ఏకంగా ముఖ్యమంత్రిపై ప్రధానికి ఫిర్యాదు చేశాయి. ఈ అపవాదును తప్పించుకోవడానికి నానాతంటాలు పడుతున్నాడు రాజశేఖరరెడ్డి. సత్యంపై సిబిఐ దర్యాప్తు జరిపితే తనకు అభ్యంతరం లేదని ప్రధానికి ఒక లేఖ వ్రాసి, తానేమీ చేయలేదనే వివరణ ఇచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు కంపెనీ విషయంలో మరొకసారి సిబిసిఐడిని రంగంలోకి దించితే, ప్రధాని ఎట్లా స్పందిస్తాడో అన్న భయం ఆయన్ను పీడిస్తున్నది.

అందువల్లే, తన అనుచరుడైన రాజమండ్రి ఎమ్మీ ఉండవల్లి అరుణకుమార్ చేత ప్రధానికి ఒక ఫిర్యాదు పత్రం పంపాడు. చంద్రబాబు కంపెనీ మీద సత్యం తరహా దర్యాప్తు జరపాలని అందులో కోరారు.

అయితే సత్యం కుంభకోణానికి, చంద్రబాబు కంపెనీకి చాలా తేడా వుంది. సత్యంలోని దాదాపు 7వేల కోట్ల రూపాయల నిధులను రామలింగరాజు తన స్వంతానికి వాడుకొన్నాడని, ఆ డబ్బుతో భూములు కొన్నాడని, బ్యాంకులలో డిపాజిట్లు వున్నట్లు ఫోర్జరీ పత్రాలు సృష్టించాడని తేలింది. చంద్రబాబు కంపెనీలో అటువంటి మోసాలేవీ జరగలేదు. కంపెనీకి వున్న భూమి విలువను తక్కువ చేసి అమ్మారన్నది మాత్రమే ఇక్కడ వివాదాంశం. సత్యంలో వలె ఇక్కడ కంపెనీ డబ్బు ఎవరూ వాడుకోలేదు. దొంగ లెక్కలు చూపలేదు. ఫోర్జరీ చేయలేదు. కేవలం భూమి విలువ తక్కువ అనే నెపంతో, అరెస్టుల వరకు వెళ్తే, దాని పరిణామాలు ఎట్లా వుంటాయన్నది ప్రశ్న చంద్రబాబు వంటి ప్రతిపక్ష నాయకుడిని కుంటి సాకులతో వేధిస్తే, ప్రజలలో కూడా ఆయన పట్ల సానుభూతి పెరుగుతుంది. దాని వల్ల కాంగ్రెస్ పార్టీకే నష్టం.

ఏది ఏమైనా, ఎన్నికల లోగా చంద్రబాబు మీద తన కక్ష తీర్చుకోవాలన్న పట్టుదలతో వున్నాడు ముఖ్యమంత్రి. ఆయన ప్రతీకారేచ్ఛ ఎంత వరకు నెరవేరుతుందో వేచి చూడాలి.

104 సంవత్సరాల సుదీర్ఘ జీవనం



శ్రీమతి బలుసు సరస్వతమ్మ
w/o చినకృష్ణమూర్తి

మా మిత్రుడు, నెల్లూరుజిల్లాలో ఎన్నోఏళ్ళు సిండికేట్ బ్యాంక్ మేనేజర్‌గా పనిచేసిన
టి. విజయమోహన్ 26-1-2009 తేది 104సంవత్సరాల తన తల్లిని కోల్పోయాడు. ఎంత వయస్సైనా తల్లి తల్లే, ఆ లోటు ఎవరూ తీర్చలేనిది.
సరస్వతమ్మగారికి 9మంది సంతానం, వారి కుటుంబానికి
మా ప్రగాఢ సంతాపం.

తూపిలి వసంతరావు
రామోదరం, సీతారామయ్య
కోటేశ్వరరావు, సుబ్బారావు, రామారావు, రంగారావు, నర్సింహారావు, దాసు, జగన్నాథం, పొదరి తదితర బంధువందం

అల్లాబక్ష్

13వ పేజీ కొరవ

సరం. ఏ పదాన్ని ఎక్కడ ఒత్తిపలకాలి ఎక్కడ విరుపు వుండాలి అనేవి చాలా ముఖ్యం. సాంఘిక నాటకాలలో కంటే పద్యనాటకాలలో భాషాజ్ఞానానికి ప్రాధాన్యత ఎక్కువ. పద్యాలు పాడినప్పుడు గొంతు హార్మోనియానికి సరిపోయేలా రాగయుక్తంగా, శృతిబద్ధంగా వినసొంపుగా వుండాలి. అప్పుడే ఏ పద్యమైనా రక్తికడుతుంది. ఏ పాత్ర పోషించినా నటనలో అంకిత భావం వుండాలన్నారు.

జ్ఞాపకశక్తి

13వ పేజీ కొరవ

భాగమే పనిచేస్తూ, కుడివైపు భాగం అసలు పని చేయదు. బాహ్య మనసుకు, అంతర్ మనసుకు ఈ రెండు భాగాలు చిహ్నాలు. మార్కులు తెచ్చుకోవడం, పరీక్షలకు హాజరు కావడం పైనే విద్యార్థులు దృష్టి పెట్టడంతో జ్ఞాపకశక్తి తగ్గడం, ఒత్తిడి పెరుగుతుంది. దీనికి కారణం తల్లిదండ్రులు, చైల్డ్ సైకాలజి తెలియని ఉపాధ్యాయులు, కొంత నిరాశావాదం. బుర్రకు ఎక్కువగా పదును పెట్టు కోవాలి. ఎక్కువగా ఆలోచిస్తే బుర్ర చెడి పోతుందని గతంలో పెద్దలు చెప్పే వారు. కానీ నేడు ఎంతగా ఆలోచిస్తే మెదడుకు అంత మంచిది. ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ ప్రొఫెసర్లు ఈ విషయాన్ని తేల్చిచెప్పారన్నారు.

బాలకృష్ణ

మొదటి పేజీ కొరవ

దానందం వ్యక్తం చేస్తున్నారు. చిరం జీవి సినీగ్లామర్‌కు మంచి విరుగుడు దొరికిందని సంతృప్తి చెందుతున్నారు. బాలకృష్ణ ఓపిక చేసుకొని రాష్ట్రమంతా తిరిగితే, అధికారం తమదే అన్న ధీమా వ్యక్తమౌతున్నది తెలుగుదేశం వర్గాలలో.

ముఖానికి వెలుగు

మొదటి పేజీ కొరవ

ఎంపిక చేయమని ఢిల్లీ నుంచి వచ్చిన సందేశం చూసి వైఎస్ ఆశ్చర్యపోయాడు. దాని వల్ల ఆయన్ను బహిరంగంగా వ్యతిరేకించే యాదవరెడ్డి, ఎఆర్ అమోస్ వంటి తెలంగాణావాదులు అనుకోకుండా మళ్లీ ఎమ్మెల్సీలైపోయారు. దీనితో డిఎస్ ముఖంలో వెలుగు, వైఎస్ ముఖంలో దిగులు కనిపించాయి. ఈ దశలోనే డిఎస్‌కు చెక్ చెప్పకపోతే, ఎమ్మెల్యేల ఎంపికలో వీరాకు సృష్టిస్తారన్న భీతి ఇప్పటి నుంచే ముఖ్యమంత్రిలో ఏర్పడుతున్నది. ఎమ్మెల్యేల విషయంలో తనదే తుది నిర్ణయంగా నడవాలన్నది ఆయన భావన. ప్రతి నియోజకవర్గంలో గెలుపు ఓటముల గురించి తాను చాలా సూక్ష్మస్థాయిలో అధ్యయనం చేసి వున్నాను కాబట్టి, ఆ ఎంపికలో ఇతరులు వేలుపెడితే అంతా సర్వనాశనం అయిపోతుందన్నది ఆయన భయం. ఈ సమస్యకు ముఖ్యమంత్రి ఏ విరుగుడు కనిపెడతాడో వేచి చూడాలి.

ఉద్యానవనశాఖ

11వ పేజీ కొరవ

మాత్రం అధికారుల వద్ద లేకపోవడం విచిత్రం.

సబ్సిడీ నిధుల మంజూరులో జరుగుతున్న జాప్యాన్ని జిల్లా వున్నతాధికారి దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాలకు సంబంధించి రైతులకు అందజేయాల్సిన సబ్సిడీ నిధులు మంజూరు చేయించాల్సిన అవసరం వుంది.

నెల్లూరు పరువు

4వ పేజీ కొరవ

వివేకానందరెడ్డిలో కలగక పోవడం దురదృష్టకరం. ఈ హీన సంస్కృతి వల్ల నెల్లూరు పరువు పెన్నలో కలిసిపోతున్నది. ఇటువంటి హీనులను ప్రజాప్రతినిధులుగా ఎన్నుకొన్నందుకు ప్రజలు తమను తాము తిట్టుకోవడం చేయగలిగింది మినహా ఏదీ కనిపించడం లేదు.

పద్యనాటకం

9వ పేజీ కొరవ

ప్రదర్శించారు. ఈ నాటకంలో శ్రీకృష్ణ దేవరాయలుగా నటించిన పి.నాగబాబుకు ఉత్తమ నటుడి అవార్డు లభించింది. తారాశశాంకం పద్యనాటకంలో తారగా నటించిన సీనియర్ నటి ఎస్.విమలాదేవికి ఉత్తమ నటి అవార్డు వచ్చింది. ఉత్తమ ప్రతినాయకుడు అవార్డును గణపతి మహాత్యంలో నటించిన టివిఎస్ సుబ్బారావు పొందారు.

నాటక పోటీలు

9వ పేజీ కొరవ

నులయ్యారు. సినీ జర్నలిస్ట్ గంగాధర్ పార్టీ పాటకచ్చేరిలో పాటలకన్నా మంత్రి రామనారాయణరెడ్డిని పొగడడానికి ఎక్కువ సమయం కేటాయించారు. నెల్లూరు నర్తకి నదియా, మాస్టర్ ఆదర్శ నృత్యాభినయాలు జరిగే సరికి వి.ఆర్. హైస్కూల్ గ్రౌండ్‌లో వేళ్ల మీద లెక్కపెట్టే సంఖ్యలో జనం వున్నారు.

తండల్ వుచ్చు

8వ పేజీ కొరవ

ఈ మొత్తాలు తీసుకొని వీరికి మళ్లీ తండల్‌కు డబ్బులిస్తారు. మూడు, నాలుగు నెలలకొకసారి జీతాలు వస్తుండడంతో తండల్ తీసుకోక తప్పడం లేదు. వీరి వద్ద మాత్రం తీసుకొనే మొత్తాలను బట్టి పది నుంచి పదిహేను రూపాయల వరకు వడ్డీ వసూలు చేస్తారు. వారం రోజుల క్రితం కుక్కలగుంటకు చెందిన ఓ కుటుంబం తీసుకొన్న మొత్తానికి నాలుగింతలు చెల్లించినా వ్యాపారికి సంతృప్తి కల్గలేదు. ఎస్పీకి వెళ్లి వినతి పత్రం ఇస్తే ఆయన తిరిగి ఎస్ఐనే కలవమన్నారు. నగరంలోని తండల్ వ్యాపారులకు ఎవరికీ లైసెన్స్ లేదు. రేషన్‌కార్డులు తీసుకొని కూడా వీరు వడ్డీకి డబ్బులిస్తారు. నగరంలో తండల్ వ్యాపారస్తుల విజృంభణను పోలీసులే అడ్డుకోవాలి.

నిలువు దోపిడీ

8వ పేజీ కొరవ

ఇవేమీ పట్టించుకోవడం లేదు. రైల్వే స్టేషన్‌లోని స్టాండ్ నిర్వాహకులు ఏదైనా వాహనం ఒకరోజు పార్కింగ్ చేస్తే ఎనిమిది రూపాయలు రుసుం వసూలు చేస్తున్నారు. పార్కింగ్ ఫీజుగా ప్రతి యేడాది లక్షలాది రూపాయలు గడిస్తూ షెడ్ల నిర్మాణానికి ఇటు ఆర్టీసి, అటు రైల్వేశాఖ వున్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత లేదంటారా?

తిరోగమనం

7వ పేజీ కొరవ

బురదమయంగా మరీ అస్తవ్యస్తంగా వుండేవి. నేడు ఈ పరిస్థితి నుంచి సాఫీగా ప్రయాణించేందుకు అధికారులు సిమెంటు రోడ్ల నిర్మాణానికి పూనుకోవడం ద్వారా వీలు కల్గింది. కృష్ణపట్నం, ముత్తుకూరు, బిసికాలనీ, రాజీవ్ కాలనీల రూపురేఖలు సిమెంటు రోడ్ల పుణ్యమా అని మారనున్నాయి. అయితే ఈ రోడ్ల నిర్మాణం ఎంతమేర అవినీతికి తావులేకుండా జరుగుతుంది అన్నదే సందేహం?

ఇందిరమ్మ

6వ పేజీ కొరవ

వరకు, మరికొందరు లింటల్ లెవల్ వరకు నిర్మించుకొన్నారు. పనులు పూర్తయి నెలరోజులు దాటుతున్నా ఇంతవరకు మొదటి బిల్లు కూడా మంజూరు చేయకపోవడంతో లబ్దిదారులు కాళ్లరిగేలా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అప్పుసొప్పు చేసి ఇంటి నిర్మాణాలు చేపట్టామని అధికారులు మాత్రం బిల్లులు మంజూరు చేయకుండా తిప్పుకొంటున్నారని ఆవేదన చెందుతున్నారు లబ్దిదారులు.

తహశీల్దార్

6వ పేజీ కొరవ

వారు కరువయ్యారని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసమూర్తి అనారోగ్య కారణంగా సెలవుపై వెళ్లారు. ఆయన స్థానంలో ఎవరిని నియమించక పోవడంతో మండలంలోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల అవసరాలను గుర్తించైనా జిల్లా అధికారులు ముత్తుకూరులో తహశీల్దార్‌గా వేరే వారిని నియమించాలని పలువురు కోరుకొంటున్నారు.

జాతీయజెండా

8వ పేజీ కొరవ

చిన్నమొత్తాల పొదుపు సంస్థ, సర్వశిక్ష అభియాన్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, స్త్రీ సంక్షేమ శాఖ, జిల్లా పరిశ్రమల శాఖ, అగ్నిమాపక శాఖలు ప్రదర్శించిన శకటాలు ఆకర్షణీయంగా వుండివాయి. వీటి తర్వాత స్కూల్ పిల్లలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో వెల్లూరు శారద ఇంగ్లీషు మీడియం స్కూల్, వియూసీహోమ్‌లోని మానసిక వికలాంగులైన పిల్లలు, సెయింట్‌జాన్స్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్, వెంకటాచలం జిల్లా పరిషత్ హైస్కూల్ పిల్లలు, సరస్వతి నగర్ రేస్ విద్యార్థులు ప్రదర్శించిన ఇతివృత్తాలు బాగుండినాయి. అన్ని ప్రభుత్వ శాఖల్లో వున్నత సేవలకుగాను ప్రశంసావత్రాలిచ్చే కార్యక్రమం పూర్తిచేయను కలెక్టర్‌కు మధ్యాహ్న భోజన వేళయ్యింది.

దురాక్రమణ

6వ పేజీ కొరవ

చెరువులో ఏకంగా ఆర్‌అండ్‌బి అధికారులు తారురోడ్డు నిర్మాణం చేపట్టారు. విడవలూరు, ముదివర్తి, వావిళ్ల చెరువుల్లో ఆక్రమ దారులు మోటర్ల సహాయంతో సాగునీరు తీసుకొనేందుకు ట్రాన్స్‌కో నుంచి విద్యుత్ కనెక్షన్లు పొందారు. చౌకచర్ల, విడవలూరు, ముదివర్తి చెరువుల్లో రెవిన్యూ అధికారులు డి-ఫారం పట్టాలను పంపిణీ చేశారు. విడవలూరు చెరువు వైశాల్యం 320 ఎకరాలు కాగా ఆక్రమణలకు గురై కేవలం 100 ఎకరాలు మాత్రమే మిగిలివుంది. వరిణి చెరువు 350 ఎకరాలకుగాను 150 ఎకరాలు ఆక్రమణదారుల చెరలో వుంది.

చేతిదుడుకు

4వ పేజీ కొరవ

ణంలో రిలయన్స్ సంస్థ మొండిచేయి చూపనుందనే వార్తలు నిరుద్యోగ యువతలో ఆగ్రహాన్ని, ఆవేదన కల్గిస్తున్నాయి. ఇటీవల గోపాలపురంలోని తుఫాన్ షెల్టర్‌లో ఉపాధి శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు రిలయన్స్ సంస్థ నిర్వాహకులు. బేల్దారి, సెంట్రింగ్ పనులకు శిక్షణనిస్తున్నామని చెప్పినా అది తూతూ మంత్రంగా నడుస్తుంది.

సంక్షేమ నిధులు

5వ పేజీ కొరవ

చేసేందుకు ముఖ్యమంత్రి తీసుకొన్న నిర్ణయమంటూ మొదట నుంచి ప్రతిపక్ష పార్టీ నేతలు ఆరోపిస్తూనే వున్నారు. అయినా కూడా వీరి మాటలు, ఆరోపణలను ఏమాత్రం పరిగణలోకి తీసుకోలేదు ముఖ్యమంత్రి. తీవ్ర నిరాశతో వున్న పార్టీ కార్యకర్తలకు లబ్ధి చేకూర్చాలన్న వుద్దేశంతో ఈ నిధుల మంజూరుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది.

సైన్యంలో చేరను ఆసక్తి చూపుతున్న యువత!

దేశాన్ని శత్రుమూకల నుంచి రక్షించేందుకు సరిహద్దుల్లో సుశిక్షితులైన సైన్యం ఎల్లవేళలా సంసిద్ధులై వుంటుంది. కన్నతల్లి కంటే జన్మభూమి గొప్పదని చాటుతూ తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా నిత్యం విరరిస్టులతో, ఫిదాయిలతో సైనికులు పోరాటం చేస్తుంటారు. అలాంటి సైన్యంలో చేరాలని, దేశానికి సేవ చేయాలని పలువురికి కోరిక వున్నా అవకాశాలు లేక వాటి గురించి తెలి యక ముఖ్యంగా గ్రామీణ యువత వెనుకబడి వుంటారు. దీనిని దృష్టిలో వుంచుకొని సైన్యంలో



ఎసి స్టేడియంలో జరుగుతున్న ఆర్మీ సెలక్షన్స్

యువత ఎక్కువ సంఖ్యలో చేరేందుకు ఎంపికలు నిర్వహిస్తున్నది ప్రభుత్వం. దీనిలోభాగంగానే జనవరి 19 నుంచి నగరంలోని ఎసి స్టేడియంలో ఎంపికలు జరిగాయి. నెల్లూరు, చిత్తూరు, అనంతపురం, గుంటూరు, కడప, ప్రకాశం, కృష్ణా జిల్లాలకు సంబంధించిన అభ్యర్థులందరికీ ఇక్కడే దేహదారుఢ్యం, పరుగు పోటీలు, వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం పదివేలకు పైగా అభ్యర్థులు హాజరైన ఈ ఎంపికలకు ఆర్మీ అధికారులు, ప్రభుత్వ అధికారులు, మంత్రులు హాజరై ఎంపికలను పరిశీలించారు. సోల్జర్ టెక్నికల్, సోల్జర్ జనరల్ డ్యూటీ, సోల్జర్ ట్రేడ్‌మెన్, క్లర్క్, కీపర్, నర్సింగ్ అసిస్టెంట్లకు సంబంధించిన కేటగిరిల్లో అభ్యర్థులకు వివిధ పరీక్షలను నిర్వహించారు. మొదట 19వ తేది నుంచి 25వ తేది వరకు ఆరు రోజులపాటు ఎంపికలు నిర్వహించాలని సైనికాధికారులు భావించినా అధిక సంఖ్యలో వివిధ జిల్లాల నుంచి అభ్యర్థులు ఉత్సాహంగా హాజరు కావడంతో మరో మూడు రోజులపాటు పొడిగించి 28వ తేది వరకు జరిపారు. మిగతా ఉద్యోగాలలో ఖాళీలు భర్తీ చేయక పోవడం, ఉద్యోగ అవకాశాలు తక్కువగా వుండడంతో సైన్యంలో చేరేందుకు పలువురు యువకులు పోటీలు పడి దూరప్రాంతాల నుంచి రావడం గమనార్హం. ఎప్పుడెప్పుడు తమకు పోటీలు నిర్వహిస్తారో? ఎవరిని ఎంపిక చేస్తారో అని యువకులు ఎసి స్టేడియం వద్ద రేయింపగళ్లు ఎంపికలు పూర్తయ్యే వరకు నిరీక్షించడం కన్పించింది. సైన్యంలో చేరేందుకు వివిధ ప్రాంతాలు, జిల్లాల నుంచి వచ్చిన అభ్యర్థులతో వారి మనోగతాన్ని, సైన్యంలో చేరడంపై కారణాలు వారి మాటల్లోనే...

ప్రత్యేకత వుంది!



దేశంలో పలు ఉద్యోగాలలో అవకాశాలు వున్నా, దేశ భద్రతకు సంబంధించిన సైన్యంలో చేరడం, సరిహద్దుల్లో విధులు నిర్వహించడంలో వున్న మజా వేరు. శత్రుదేశాల నుంచి, విరరిస్టుల నుంచి దేశాన్ని రక్షించడంలో కీలకపాత్ర పోషించే సైన్యంలో చేరి నావంతు సేవ చేయాలన్నదే నా చిన్ననాటి కోరిక. అందుకే ఈ పోటీలలో పాల్గొన్నాను. ఇతర ఉద్యోగాల కంటే జీతభత్యాలు, గౌరవం ఇందులో ఎక్కువ. దీనికి ఒక ప్రత్యేకత వుంది.

సి.శేఖర్, చిత్తూరు.

భిన్నమైన ఉద్యోగం



మిగతా ఉద్యోగాలకంటే సైన్యంలో విధులు నిర్వహించడం భిన్నమైనది. అనుక్షణం దేశ భద్రతను కాపాడడంలో అప్రమత్తంగా వుండడం, దేశాన్ని రక్షించడం ప్రధమ కర్తవ్యం. అలాంటి ప్రతిష్టాత్మక ఉద్యోగం చేయడం అదృష్టం. అందుకోసమే ఈ ఎంపికల్లో పాల్గొన్నాను. ఎలాగైనా ఆర్మీలో ఉద్యోగం పొంది సొంత ఊరికి పేరు తేవాలన్నదే నా ఆశయం.

ఎం.బాలకృష్ణంరాజు, విజయవాడ.

దేశ సేవ చేయాలి!



సైన్యంలో చేరి దేశ సేవ చేయాలన్నదే నా లక్ష్యం. దాని కోసం తగిన శిక్షణ తీసుకొన్నాను. నిర్ణీత సమయానికి పరుగు పోటీల్లో పాల్గొనడం, దేహ దారుఢ్యాన్ని పెంపొందించుకొనేందుకు తగిన కసరత్తులు చేస్తున్నాను. ఎలాగైనా సైన్యంలో చేరి ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించాలన్నదే నా ఆశయం. ఇప్పుడు జరిగిన ఎంపికలలో కచ్చితంగా ఎంపిక అవుతానన్న నమ్మకం వుంది.

యాకూబ్‌బేగ్, గుంటూరు.

జనాన్ని వివేకా బెదరించడం దారుణం!

ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో వివిధ పార్టీలు ప్రజలను ఆకట్టుకొనేందుకు, ఓట్లను పొందేందుకు రకరకాల ప్రయత్నాలు, జిమ్మిక్కులు చేస్తున్నాయి. ఇది రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీల నేతలు అనుసరిస్తున్న తీరే. కాని నెల్లూరులో మాత్రం దీనికి భిన్నమైన వాతావరణం నెలకొని వుంది. ఎమ్మెల్యే వివేకానందరెడ్డి తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని పలు పార్టీలు ఆరోపిస్తున్నాయి. ప్రజలు చీదరించుకొంటున్నా తన ఇష్టులైన వారిని సంతోష పెట్టడానికి ఎంతకైనా దిగజారి ప్రవర్తిస్తున్న తీరు ప్రజాస్వామ్యాన్నే అపహాస్యం పాల్చేస్తున్నది. ఇలాంటి పరిస్థితులలో నెల్లూరు శివార్లలోని వైఎస్ నగర్‌లో జరిగిన కార్యక్రమంలో సాక్షాత్తు గృహ నిర్మాణశాఖ మంత్రి బొత్సా సత్యనారాయణ పార్టీలకు అతీతంగా అర్హులైన పేదవారందరికీ ఇళ్ళ స్థలాలు ఇస్తామని, ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని సభాముఖంగా ప్రకటించిన కొద్ది నిమిషాలకే వివేకా తనదైన శైలిలో ప్రజలను బెదిరించేలా వ్యాఖ్యానించడం సంచలనం సృష్టించింది. మీలో ఎవరైనా కాంగ్రెస్‌పార్టీకి కాకుండా ప్రజారాజ్యం పార్టీకి గాని, తెలుగుదేశం, కమ్యూనిస్టుపార్టీలకు ఓటు వేసినట్లయితే మీకిచ్చిన ఇళ్ల పట్టాలు పీకేసుకొంటాం, కట్టించి ఇచ్చిన ఇళ్లు వెనక్కి తీసుకొంటాం అని గుడ్లు ఉరమదంతో అక్కడ వున్న ప్రజలు భయపడిపోయారు. ఒక ఎమ్మెల్యే ఇలా బజారు రౌడీలా, గూండాలా బెదిరెగించి ఓట్లు వేయకపోతే అంతు చూస్తానని బెదిరింపులకు పాల్పడడం రెక్కాడితేగాని డొక్కాడని పేదలను హడలగొట్టింది. రేషన్ కార్డుల కోసం అక్కడకు వచ్చి తమకు కార్డులు అందజేయాలని అడిగిన అర్హులైన పేదవారి పట్ల ఆయన ప్రతాపం చూపించారు. మహిళలని కూడా చూడకుండా నేను ఇవ్వను మీకు దిక్కున్న చోట చెప్పుకోండి అని గద్దించారు. దీనిపై వాళ్లు ప్రశ్నించే సరికి ఒక దశలో వివేకా నోరుమూసుకొని వెళ్లండి అంటూ హూంకరించడంతో చేసేది లేక పేద మహిళలు ఎమ్మెల్యే వైఖరిపై శాపనార్థాలు పెడుతూ వెనుదిరిగారు. ఒక వైపు తన అనుచరుల ఇసుక బూడిదరోడ్లు, ఆపైన మళ్లీ సిమెంటు రోడ్లు వేస్తుంటే, మరోవైపు తన మాట కాదన్న అధికారులను బదిలీ చేయడం, ఇతర పార్టీల వారిని చులకనగా మాట్లాడటం చేస్తున్న ఎమ్మెల్యే వివేకా తీరుపై వివిధ పార్టీల నేతలు అభిప్రాయాలు ఈవిధంగా వున్నాయి.



ఓటమి భయం!



ఎమ్మెల్యే వివేకానందరెడ్డికి ఓటమి భయం పట్టుకొంది. అందుకే నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాడు. ప్రజాస్వామ్య విలువలు కాపాడాల్సిన వ్యక్తి పెత్తందారి మనస్తత్వాన్ని ప్రతిబింబించేలా ఓటు వేయకపోతే ఇళ్లు వెనక్కితీసుకొంటానని వ్యాఖ్యలు బహిరంగంగా చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయం. వివేకా చేష్టలకు, వ్యాఖ్యలకు వచ్చే ఎన్నికలలో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారు.

కె.ఆంజనేయరెడ్డి,
బిజెపి కిసాన్‌మోర్చా రాష్ట్ర ప్రధానకార్యదర్శి

వివేకా సొంత నిధులా?



కాంగ్రెస్ పార్టీకి ఓటు చేయకపోతే పేదలకు ప్రభుత్వం అందించిన ఇళ్ల స్థలాలను, గృహాలను వెనక్కి తీసుకొంటామని ఎమ్మెల్యే వివేకా బెదిరించడం బ్రిటిష్ పాలకుల అరాచకాన్ని గుర్తు చేస్తోంది. సంక్షేమ పథకాలు పేదల కోసం ప్రభుత్వం అందజేస్తుంది. అలాంటిది వివేకానందరెడ్డి తన సొంతడబ్బులు ఇచ్చినట్లు మాట్లాడడం అప్రజాస్వామికం. ఇచ్చినవి వెనక్కి తీసుకొనే ప్రయత్నం చేస్తే పేదల పక్షాన ఎంతటి పోరాటానికైనా ప్రజారాజ్యం పార్టీ సిద్ధంగా వుంది.

ఎం.శ్రీధరకృష్ణారెడ్డి,
ప్రజారాజ్యం అధికార ప్రతినిధి.

ఆయన సంగతి తేలుస్తాం!




ఎమ్మెల్యే వివేకానందరెడ్డి శృతిమించి ప్రవర్తిస్తున్నాడు. పేద ప్రజలకు ప్రభుత్వం అందజేసే పథకాలను ఈయనెవరు వెనక్కితీసుకొంటానని అనడానికి? వివేకాకు ఓటు వేయకపోతే ఇళ్ల పట్టాలు, ఇళ్లు వెనక్కి తీసుకొంటానని బహిరంగంగా ప్రకటించడం ప్రజలను బెదిరించడమే. ఎవరిచ్చారు ఆ అధికారం. ప్రజలను భయోత్పాతానికి గురి చేస్తే తీరుకోం. ఒకసారి ఇచ్చిన ఇళ్లు, స్థలాలు వెనక్కి తీసుకొనే ప్రయత్నం చేస్తే ఆయన సంగతి తేలుస్తాం. ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకోకపోతే తగిన బుద్ధి చెపుతాం.

టి.వి.భానురాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి

ఆరవ వర్ధంతి

స్వయం కృషితో అభివృద్ధిలోకి వచ్చి ఎల్ల వేళలా మా అభివృద్ధిని కాంక్షించి
మమ్ము తన గుండెలలో దాచుకున్న ప్రేమ మయుడు, మా ఇంటి ఇలవేల్పు



జననం
2-12-1931

మరణం
5-2-2003

శ్రీ గూడూరు భాస్కరరామిరెడ్డి గారు

(మాజీ మున్సిపల్ కౌన్సిలర్, నెల్లూరు)

మీరు మా మధ్యలేరన్న నిజాన్ని నమ్మలేకున్నాం.
మీరు భువిలో వున్నా, దివిలో వున్నా మీ ఆశీస్సులే మాకు శ్రీరామరక్ష

భార్య : **గూడూరు రత్నమ్మ**

కుమారులు - కోడళ్ళు : **గూడూరు మాధవరెడ్డి - అనిత**
గూడూరు మహేష్‌రెడ్డి M.Tech., M.S., (U.S.A) - **శ్రీదేవి** B.Tech., (U.S.A)

కుమార్తె : **ఎస్.మైథిలి**

మనుమలు - మనుమరాండ్రు : **శివమహేష్** (U.S.A), **లక్ష్మీలాస్య, సాయిమునితేజ, అమిత్** (U.S.A), **బాలిక** (U.S.A)

Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.